www.vaarthavedhikasurya.com
PRGI.NO:- TGTEL/25/A0305
# వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

| యాదాద్రి భువనగిరి YADADRI BHUVANAGIRI | సంపుటి: 1 VOLUME : 1 | సంచిక: 351 ISSUE : 351 | సోమవారం, 18 మే, 2026 MONDAY, MAY 18, 2026 | ఎడిటర్: పోలోజు శ్రీనివాసచారి EDITOR : POLOJU SRINIVASA CHARY | పేజీలు: 8 PAGES : 8 | వెల: 5-00 RS : 5-00 |
|---|---|---|---|---|---|---|

## రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో అగ్నిప్రమాదం

- తిరువనంతపురం నుంచి న్యూఢిల్లీ వెళ్తుండగా ఏసీ కోచ్‌లో మంటలు
- మధ్యప్రదేశ్‌లోని రత్లాం వద్దకు చేరుకోగానే ఘటన
- తప్పిన పెను ప్రమాదం

2లో..

# ఎప్‌సెట్-2026 ర్యాంకుల్లో అబ్బాయిలే టాప్

- ఇంజనీరింగ్‌లో మొదటి 10లో 8,అగ్రికల్చర్‌లో 7 ర్యాంకులు వారివే
- మొత్తం ఫలితాలపరంగా చూస్తే మాత్రం అమ్మాయిలదే ఆధిపత్యం
- ఇంజనీరింగ్, అగ్రి టాప్-10లో ఐదుగురు ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు
- అగ్రికల్చర్‌లో 86.27 శాతం, ఇంజనీరింగ్‌లో 73.36శాతం అర్హత
- ఫలితాలను విడుదల చేసిన ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు




హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-మే 17:

రాష్ట్రంలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎప్‌సెట్-2026 ఫలితాల్లో టాపర్లలో ఎక్కువ మంది అబ్బాయిలు ఉండగా, మొత్తంగా ఫలితాల్లో అమ్మాయిలు పైచేయి సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో మొదటి 10 ర్యాంకుల్లో 8.. అగ్రికల్చర్, ఫార్మసీలో మొదటి 10 ర్యాంకుల్లో 7 అబ్బాయిలకే దక్కాయి. మొత్తంగా చూస్తే ఇంజనీరింగ్ విభాగంలో అమ్మాయిలు 73.72శాతం అర్హత సాధించగా, అబ్బాయిలు 73.10 శాతం అర్హత సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో అమ్మాయిలు 86.76 శాతం, అబ్బాయిలు 84.70 శాతం అర్హత సాధించారు. మొత్తంగా ఇంజనీరింగ్ విభాగంలో 73.36 శాతం, అగ్రికల్చర్‌లో 86.27 శాతం అర్హత సాధించారు. ఎప్‌సెట్ ఫలితాలను ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రభుత్వ సలహాదారు కంచర్ల కేశవరావు విడుదల చేశారు. ఈ నెల 4, 5 తేదీల్లో నిర్వహించిన అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షకు 84,954 మంది హాజరు కాగా, 73,294 మంది అర్హత సాధించారు. ఇంజనీరింగ్ విభాగం పరీక్షను 1,97,242 మంది రాయగా, 1,44,704 మంది అర్హత సాధించారు. మొత్తంగా ఎప్‌సెట్ రాసినవారిలో ఈసారి 64,198 అర్హత సాధించలేకపోయారు.

### 2 విభాగాల్లోనూ హైదరాబాదీలకే ఫస్ట్ ర్యాంక్

ఈసారి ఎప్‌సెట్‌లో రెండు విభాగాల్లోనూ హైదరాబాద్‌కు చెందిన విద్యార్థులకే మొదటి ర్యాంకులు దక్కాయి. ఇంజనీరింగ్ విభాగంలో ఉప్పల్‌కు చెందిన ఎం.రుషి మొదటి ర్యాంకు సాధించగా.. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో హుమాయిన్ నగర్‌కు చెందిన ముఖరం అహ్మద్ ప్రథమస్థానంలో మిగతా 2లో..

# భారత సెమీకండక్టర్స్‌కు నెదర్లాండ్స్ దన్ను

- టాటా-డచ్ సంస్థల భాగస్వామ్యంతో గుజరాత్‌లో భారీ కంపెనీ
- డచ్ ప్రధాని రాబ్ జెట్టెన్‌తో మోదీ ద్వైపాక్షిక చర్చలు.. 17 ఒప్పందాలు
- నెదర్లాండ్స్ పర్యటన ముగించుకొని స్వీడన్ చేరుకున్న భారత ప్రధాని
- మోడీకి స్వీడన్ అత్యున్నత పురస్కారం



ది హేగ్, మే 17: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) బూమ్‌తో ప్రపంచమంతా సెమీకండక్టర్లు, చిప్‌లకు కొరత ఏర్పడిన నేపథ్యంలో భారత్‌లో సెమీకండక్టర్ల పరిశ్రమ అభివృద్ధికి సహకారం అందించేందుకు నెదర్లాండ్స్ ముందుకొచ్చింది. భారత పారిశ్రామిక దిగ్గజం టాటా గ్రూప్, నెదర్లాండ్స్ కంపెనీ ఏఎస్ఎంఎల్ సంయుక్తంగా గుజరాత్‌లోని ధోలేరాలో భారీ సెమీకండక్టర్ కంపెనీని నెలకొల్పేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాయి. నాలుగు దేశాల పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ.. శనివారం సాయంత్రం (స్థానిక కాలమానం) నెదర్లాండ్స్‌లో ఆ దేశ ప్రధాని ప్రధాని రాబ్ జెట్టెన్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఇద్దరు ప్రధానుల సమక్షంలో ఈ రెండు కంపెనీల మధ్య ఒప్పందం కుదిరింది. మొత్తంగా రెండు దేశాల మధ్య వివిధ రంగాల్లో 17 ఒప్పందాలు కుదిరాయి. రక్షణ, క్రిటికల్ మినరల్స్, శాస్త్రసాంకేతిక రంగం, ఆరోగ్యం, వ్యవసాయం, నీటి నిర్వహణ, వాతావరణ మార్పులు, ఇంధనం, సముద్ర రవాణా, ప్రజా సంబంధాలు తదితర రంగాల్లో పరస్పరం సహకారం అందించుకోవాలని నిర్ణయించారు. చర్చల అనంతరం ఇద్దరు ప్రధానులు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ప్రపంచ సంక్షేమం దృష్ట్యా హోర్ముజ్ జలసంధిని వెంటనే తెరిచి వాణిజ్య నౌకల రాకపోకలకు మార్గం సుగమం చేయాలని, ఉక్రెయిన్, రష్యాలు వెంటనే యుద్ధాన్ని ఆపేసి చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. అమెరికా-ఇరాన్ యుద్ధ వల్ల పశ్చిమాసియాలో ఏర్పడిన కల్లోల పరిస్థితులపై ఆందోళన వ్యక్తంచేశారు. ఐక్యరాజ్యసమితిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం కోసం నెదర్లాండ్స్ మద్దతు ప్రకటించింది. 'నెదర్లాండ్స్‌లో నా పర్యటన రెండు దేశాల సంబంధాల్లో కొత్త అధ్యాయాన్ని తెరిచింది. సాధారణ సంబంధాలను అనేక రంగాల్లో వ్యూహాత్మక స్థాయికి తీసుకెళ్లింది' అని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. తన పర్యటనలో భాగంగా నెదర్లాండ్స్‌లోని మిగతా 2లో..



## జూన్ 2 నుంచి 2లక్షల మందికి కొత్త పింఛన్లు

- రెండో విడత ఇళ్లూ మంజూరు
- కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్

2లో..

# కేటీపీఎస్‌లో భారీ అగ్ని ప్రమాదం



- యూనిట్-3లో ఆయిల్ లీకేజీతో ఎగిసిపడిన మంటలు
- కార్మికులు లేకపోవడంతో తప్పిన ప్రాణనష్టం

దామరచర్ల, (వార్త వేదిక సూర్య)-మే 17:

నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం శివారులోని థర్మల్ పవర్ స్టేషన్)లోని యూనిట్-3లో ఆదివారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. దీంతో భారీస్థాయిలో ఆస్తి నష్టం సంభవించినట్లు సమాచారం. ఇందులో 800 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం కలిగిన మొత్తం ఐదు యూని ట్ల ద్వారా నాలుగు వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా నిర్మాణం పూర్తికావస్తోంది. ఇప్పటికే యూనిట్-1, 2, 4లలో విద్యుదుత్పత్తి ప్రా రంభం కాగా యూనిట్-3 ప నులు ఇటీవల పూర్తయ్యాయి. దీంతో సీవోడీ(కమర్షియల్ ఆపరేషన్ డేట్) ప్రక్రియను పూర్తిచేసిన బీహెచ్ఈఎల్ అధికారులు విద్యుదుత్పత్తికి రంగం సిద్ధం చేశారు. గ్రిడ్‌కు అనుసంధానం చేసేందుకు జెన్‌కోకు అప్పగించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటలకు యూనిట్-3లోని టర్బైన్‌కు నీటి సరఫరా జరిగే ప్రాంతంలో ఆయిల్ పైపు లీకవడంతో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. పొగలు దట్టంగా కమ్ముకున్నాయి. వెంటనే అప్రమత్తమైన అధికారులు పరిశ్రమకు సంబంధించిన ఆరు ఫైరింజన్లతో మంటలను అదుపులోకి తెచ్చేందుకు చెమటోడ్చారు. గంటలోపు అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనతో సమీపంలోని యంత్రాలు, కేబుల్ వైర్లు దగ్ధమై పెద్దఎత్తున ఆస్తి నష్టం జరిగినట్లు మిగతా 2లో..




# 20 మందితో సతీశన్ కేబినెట్

- తొలిసారిగా బాధ్యతలు చేపట్టనున్న 14 మంది
- మంత్రుల్లో ఇద్దరు మహిళలు, ఇద్దరు ఎస్సీలకు ఛాన్స్
- సామాజిక, ప్రాంతీయ, మిత్రపక్షాల సమీకరణాలను పరిగణనలోకి మంత్రుల ఎంపిక
- సతీశన్ వెల్లడి.. సీఎంగా నేడు ప్రమాణ స్వీకారం
- తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం

తిరువనంతపురం, మే 17: కేరళ సీఎంగా సోమవారం ప్రమాణం చేయనున్న వీడీ సతీశన్ తన మంత్రివర్గ సభ్యుల పేర్లను వెల్లడించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. భాగస్వామ్య పక్షాలతో సంప్రదింపులు జరిపిన తర్వాత మంత్రివర్గంలోకి తీసుకునే వారి జాబితాను ఖరారు చేసినట్లు చెప్పారు. మొత్తం 20 మందితో మంత్రివర్గం ఏర్పాటు కానుండగా అందులో 14 మంది తొలిసారిగా బాధ్యతలు చేపట్టనున్నవారే కావడం గమనార్హం. మంత్రుల్లో ఇద్దరు మహిళలు, ఇద్దరు ఎస్సీలు ఉండనున్నారు. సామాజిక, ప్రాంతీయ, మిత్రపక్షాల సమీకరణాలను పరిగణనలోకి తీసుకొని మంత్రులను ఎంపిక చేసినట్లు సతీశన్ వెల్లడించారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు రమేశ్ చెన్నితాల, మురళీధరన్, కేపీసీసీ చీఫ్ సన్నీ జోసెఫ్‌లను మంత్రివర్గంలోకి తీసుకున్నట్లు చెప్పారు. సీనియర్ ఎమ్మెల్యే తిరువంచూర్ రాధాకృష్ణన్‌ను స్పీకర్‌గా, షనిమోల్ ఉస్మాన్‌ను డిప్యూటీ స్పీకర్‌గా నియమించాలని యూడీఎఫ్ నిర్ణయించిందని వివరించారు. గతంలో మంత్రులుగా పనిచేసిన అనుభవం ఉన్న ఐయూఎంఎల్ సీనియర్ నాయకుడు పి.కె.కున్హాలికుట్టి, ఆర్ఎస్పీ నాయకుడు శిబు బాబీ జాన్, కేరళ కాంగ్రెస్ నాయకుడు మోన్స్ జోసెఫ్, కేరళ కాంగ్రెస్ (జాకోబ్)కు చెందిన మిగతా 2లో..



## కళ్లలో కారం కొట్టి.. మెడకు చున్నీ బిగించి..

- భూవివాదంతో సమీప బంధువులపై ఐదేళ్లుగా న్యాయపోరాటం
- వ్యవసాయ క్షేత్రంలోనే తల్లీకుమార్తెల దారుణ హత్య

2లో..

# బండి సంజయ్‌ను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలి

- పోక్సో కేసు విచారణ నిష్పక్షపాతంగా జరపాలి
- ఈ కేసును ముఖ్యమంత్రి నీరుగార్చే కుట్ర చేస్తున్నరు
- 'నా బూత్.. నా భవిష్యత్తు'లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, (వార్త వేదిక సూర్య) మే 17:

పోక్సో చట్టం కింద బండి భగీరథ్ అరెస్ట్ అయిన నేపథ్యంలో ఈ కేసు నిష్పక్షపాతంగా విచారణ జరగాలంటే కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని ప్రధాని మోదీని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఎల్బీ నగర్‌లో నిర్వహించిన 'నా బూత్.. నా భవిష్యత్తు' కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. ప్రధాని మోదీ 'బేటీ పడావో.. బేటీ బచావో' అంటున్నారన్నారు. కేవలం ఇది నినాదాలకే పరిమితమైతే న్యాయం జరగదని పేర్కొన్నారు. భారతదేశంలో మొట్టమొదటిసారి కేంద్రమంత్రి కుమారుడి మీద లుకౌట్ నోటీస్ ఇచ్చే పరిస్థితి వచ్చిందని చెప్పారు. బండి సంజయ్‌ను కేంద్ర మంత్రి పదవి నుంచి మిగతా 2లో..

## 'సర్'కు మతం రంగు పులుముతారా?

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

2లో..

## కేరళంకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- నేడు ఆ రాష్ట్ర సీఎం ప్రమాణ స్వీకారంలో పాల్గొననున్న ముఖ్యమంత్రి



2లో..



# వైటీపీఎస్‌లో భారీ అగ్ని ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

సమాచారం. దీంతో యూనిట్-3ని గ్రిడ్‌కు అనుసంధానం చేసే ప్రక్రియ నెలకు పైగా ఆలస్యమయ్యే అవకాశం ఉందని సమాచారం. యూనిట్-3లో నిత్యం అధిక సంఖ్యలో కార్మికులు విధులు నిర్వర్తిస్తుంటారు. ఆదివారం సెలవు దినం కావడం, ఆ ప్రాంతంలో తక్కువ సంఖ్యలో కార్మికులు ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. వైటీపీఎస్‌లో తరచూ అగ్ని ప్రమాదాలు జరుగుతున్నట్లు సమాచారం. గతంలో యూనిట్-1 ప్రారంభానికి కొద్ది రోజుల ముందు అగ్ని ప్రమాదం సంభవించి భారీస్థాయిలో ఆస్తి నష్టం జరిగింది. అప్పుడు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించింది.



# రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో అగ్నిప్రమాదం

- తిరువనంతపురం నుంచి న్యూఢిల్లీ వెళ్తుండగా ఏసీ కోచ్‌లో మంటలు
- మధ్యప్రదేశ్‌లోని రత్లాం వద్దకు చేరుకోగానే ఘటన
- తప్పిన పెను ప్రమాదం

**రత్లాం/కోటా, మే 17:** మధ్యప్రదేశ్‌లోని రత్లాం జిల్లాలో పెను ప్రమాదం తప్పింది. ఆదివారం తెల్లవారుజామున తిరువనంతపురం నుంచి న్యూఢిల్లీ వెళ్తున్న రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. ఏసీ కోచ్‌లో మంటలు చెలరేగిన ఘటనలో రెండు కోచ్‌లు దెబ్బతినగా, బిజీగా ఉండే ముంబై-ఢిల్లీ మార్గంలో దాదాపు 7గంటల పాటు రైల్వే ట్రాఫిక్ నిలిచిపోయింది. దాదాపు 13 రైలు సర్వీసులపై ప్రభావం పడింది. కోచ్‌లో మంటలు చెలరేగిన విషయాన్ని రైల్వే సిబ్బంది గుర్తించి.. తక్షణం సహాయక చర్యలు చేపట్టడంతో, అదృష్టవశాత్తూ ఆ బోగీలోని ప్రయాణికులకు ప్రాణాపాయం తప్పింది. 15 నిమిషాల్లో ప్రభావిత బోగీలోని ప్రయాణికులందరినీ కిందకు దింపేశారు. ఓవర్ హెడ్ లైన్ ఎలక్ట్రికల్ లైన్‌కు విద్యుత్తు సరఫరాను నిలిపివేసి.. అగ్నిమాపక దళం సహాయంతో మంటలను ఆర్పివేశారు. మంటలు చెలరేగిన కోచ్‌లను రైలు నుంచి వేరు చేసిన తర్వాత, సుమారు 9.45 గంటల సమయంలో రైలు తిరిగి గమ్యస్థానానికి బయలుదేరింది. అగ్నిప్రమాదానికి కారణంపై రైల్వే అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

# జూన్ 2 నుంచి 2లక్షల మందికి కొత్త పింఛన్లు

- రెండో విడత ఇళ్లూ మంజూరు
- కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్

**మిర్యాలగూడ, (వార్త వేదిక సూర్య)-మే 17:**

తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ 2వ తేదీ నుంచి రెండు లక్షల మందికి కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ తెలిపారు. ఆదివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేయలేదని ఆరోపించారు. రాష్ట్రంలో నూతనంగా 2లక్షల మందికి పింఛన్లు మంజూరు కోసం బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తోందని, వేగవంతంగా దిగుమతులు చేయించేందుకు అధికారులు, మిల్లర్లను సమన్వయం చేస్తూ చర్యలు చేపట్టిందన్నారు. ఈ నెలాఖరులోగా ఐకేపీ కేంద్రాల్లోని ధాన్యాన్ని ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేస్తుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం రాష్ట్రవ్యాప్తంగా పూర్తయి గృహ ప్రవేశాలు అవుతున్నాయన్నారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియ జూన్‌లో ప్రారంభవుతుందని ఆయన తెలిపారు.



# భారత సెమీకండక్టర్స్‌కు నెదర్లాండ్స్ దన్ను

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన కంపెనీల సీఈవోలతో ప్రధాని మోదీ సమావేశమయ్యారు. ఈ సమావేశంలో దాదాపు 300మంది సీఈవోలు పాల్గొన్నారని భారత విదేశాంగ శాఖ తెలిపింది. భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని వారిని మోదీ ఆహ్వానించారు. నెదర్లాండ్స్ పర్యటనను ముగించుకొని ప్రధాని మోదీ ఆదివారం స్వీడన్ చేరుకున్నారు. కాగా, డచ్ ప్రధాన రాబ్ జెట్టెన్‌తో కలిసి ప్రఖ్యాత జలాశయం అఫ్‌స్లుట్‌డెక్ డ్యామ్‌ను మోదీ సందర్శించారు. నీటి నిర్వహణలో ఈ డ్యామ్ ప్రపంచంలోనే ఒక అద్భుతంగా పేరుగాంచింది. ఇది 32 కిలోమీటర్ల పొడవైన డ్యామ్ కమ్ కాజ్‌వే. దీనిని 1932లో నిర్మించారు. ఈ డ్యామ్ ఉత్తర సముద్రాన్ని(వాడెన్ సీ), ఇస్సెల్‌మీర్ మంచినీటి సరస్సును వేరు చేస్తుంది. 90 ఏళ్లుగా వరదల నుంచి నెదర్లాండ్స్‌లోని చాలా భూభాగాన్ని ఈ డ్యామ్ కాపాడుతోంది. సముద్రం మధ్యలో ఈ కాజ్‌వేను 300 ఫీట్ల వెడల్పుతో నిర్మించారు.



మోదీకి స్వీడన్ అత్యున్నత పురస్కారం

నెదర్లాండ్స్ నుంచి స్వీడన్ చేరుకున్న ప్రధాని మోదీకి ఘన స్వాగతం లభించింది. మోదీ ప్రయాణిస్తున్న విమానం స్వీడన్ గగనతలంలోకి ప్రవేశించగానే ఆ దేశానికి చెందిన గ్రిపెన్ యుద్ధ విమానాలు గౌరవ సూచకంగా మోదీ విమానానికి ఎస్కార్ట్‌గా వచ్చాయి. వాటి రక్షణలో మోదీ స్వీడన్‌లోని రెండో అతిపెద్ద నగరం గోతెన్‌బర్గ్‌లో ల్యాండ్ అయ్యారు. ఆయనకు స్వీడన్ ప్రధాని ఉల్ఫ్ క్రిస్టెన్‌సన్ స్వయగా స్వాగతం పలికారు. అనంతరం ఇద్దరు నేతలు ద్వైపాక్షి చర్చలు జరిపారు. ఈ సందర్భంగా మోదీకి క్రిస్టెన్‌స.. స్వీడన్ అత్యున్నత పురస్కారమైన 'రాయల్ ఆర్డర్ ఆఫ్ పోలార్ స్టార్'ను ప్రకటించారు. మోదీకి ఇప్పటివరకు లభించిన అంతర్జాతీయ పౌర పురస్కారాల్లో ఇది 31వది. ఆదివారం సాయంత్రం మోదీకి స్వీడన్ ప్రధాని విందు ఇచ్చారు.

## బండి సంజయ్‌ను కేబినెట్ నుంచి

# బర్తరఫ్ చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

బర్తరఫ్ చేయకపోతే ఈ కేసు విచారణ సజావుగా జరిగే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేశారు. తప్పు చేసిన కొడుకుని తొమ్మిది రోజులు దాచి పెట్టారంటూ కేంద్రమంత్రి సంజయ్‌పై ఆయన నిప్పులు చెరిగారు. సంజయ్ లాంటి వ్యక్తి పదవిలో కొనసాగడం తెలంగాణకే కాదు.. భారతదేశానికి కూడా అవమానకరమన్నారు. కేంద్ర మంత్రి కొడుకు మైనర్ బాలికకు అన్యాయం చేశాడని విమర్శించారు. మైనర్ బాలిక తల్లిదండ్రుల్ని స్వయాన కేంద్ర మంత్రి భయభ్రాంతులకు గురిచేశారని గుర్తు చేశారు. ఈ కేసును నీరుగార్చే ప్రయత్నం చేసింది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని కేటీఆర్ ఆరోపించారు. హనీ ట్రాప్ అని, మీడియాను మనీ ట్రాప్‌లో వేసి.. సీఎం రేవంత్, కేంద్ర మంత్రి బండి సంజయ్.. ఇద్దరూ మీడియాలో వార్తలు రానీవ్వకుండా చేశారని మండిపడ్డారు. కేంద్ర మంత్రి పదవి నుంచి సంజయ్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అలా చేయకుంటే తన మీద అఘాయిత్యం జరిగినా ముందుకు వచ్చే ధైర్యం ఏ ఆడబిడ్డ చేయదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే బండి సంజయ్‌ను కేంద్రమంత్రి పదవి నుంచి తొలగించి.. ఈ కేసు విచారణను నిష్పక్షపాతంగా జరిపించాలని కేంద్రానికి ఆయన స్పష్టం చేశారు. కేంద్రమంత్రి ఎన్ని రకాలుగా బెదిరింపులు, ఒత్తిళ్లు తెచ్చినా బాధిత బాలికకు తల్లి అండగా నిలబడిందన్నారు. ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి ఇద్దరూ కుమ్మక్కై ఆ అమ్మాయికి అన్యాయం చేయాలనుకున్నా.. ఆ తల్లిదండ్రులు వెనకడుగు వేయలేదని తెలిపారు. బాలిక తరపున పోరాటం చేసిన బీఆర్ఎస్ పార్టీ మహిళా విభాగానికి ఈ సందర్భంగా కేటీఆర్ అభినందనలు తెలియజేశారు. బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ కూడా ఈ కేసులో చాలా గట్టిగా కొట్లాడారని గుర్తు చేశారు. బండి భగీరథ్ లొంగిపోయాడు, అరెస్టయ్యాడంటూ డ్రామా నడుస్తున్నదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేర్కొన్నారు.

# 20 మందితో సతీశన్ క్యాబినెట్

(మొదటి పేజీ తరువాయి)

అనూప్ జాకోబ్‌లకు మళ్లీ పదవులు దక్కాయి. కాంగ్రెస్ 63 సీట్లలోనే గెలిచినందున చాలా మంది ఆశావహులకు మంత్రివర్గంలో చోటు కల్పించలేకపోతున్నట్లు తెలిపారు. యూడీఎఫ్లో కీలక భాగస్వామి అయిన ఐయూఎంఎల్‌కు 5 మంత్రి పదవులు దక్కాయి. సోమవారం సతీశన్‌తో పాటు 20 మంది మంత్రులు కూడా ప్రమాణం చేయనున్నారు. తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించనున్నారు.

# కేరళంకు ముఖ్యమంత్రి రేవంత్

**హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-మే 17:**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేరళం పర్యటనకు వెళ్లారు. సోమవారం ఆ రాష్ట్ర సీఎంగా వీడీ సతీశన్ ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో ఆ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆదివారమే బయలుదేరి వెళ్లారు. ఇటు.. రాష్ట్రంలో మే 21 నుంచి జూన్ 1 వరకు జరిగే సరస్వతీ అంత్యపుష్కరాలకు హాజరుకావాలని, మే 23న యాదగిరి గుట్టలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి వేద పాఠశాలతో పాటు దేవస్థానానికి సంబంధించిన ఇతర పనుల శంకుస్థాపన కార్యక్రమాలకు రావాలని కోరుతూ దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ.. రేవంత్‌రెడ్డికి ఆహ్వానపత్రికలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీలు వేం నరేందర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, విప్ బీర్ల ఐలయ్య పాల్గొన్నారు.

# ఎప్‌సెట్-2026 ర్యాంకుల్లో అబ్బాయిలే టాప్

(మొదటి పేజీ తరువాయి)

నిలిచాడు. కాగా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలువురు విద్యార్థులు ఎప్‌సెట్‌లో టాప్ ర్యాంకులు సాధించారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం పదేళ్లపాటు ఏపీ అభ్యర్థులకు తెలంగాణలో, తెలంగాణ విద్యార్థులకు ఏపీలోని కాలేజీల్లో అడ్మిషన్లు లభించాయి. గత రెండేళ్లుగా రెండు రాష్ట్రాలు ఆ అవకాశాన్ని రద్దు చేశాయి. అయినా, ఏపీ విద్యార్థులుతెలంగాణ ఎప్‌సెట్ రాస్తున్నారు. ఈ ఏడాది ఇంజనీరింగ్ విభాగంలో 3, 4.. అగ్రికల్చర్‌లో 6, 7, 9 ర్యాంకులను ఏపీ అభ్యర్థులు సాధించారు. కాగా, ఎప్‌సెట్ ఫలితాలను పరీక్షలు ముగిసిన వారంలోపే విడుదల చేయడంపై విద్యార్థులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. 11న పరీక్షలు ముగియగా, ఆరు రోజుల్లోనే ఫలితాలను విడుదలకు చర్యలు చేపట్టిన ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి, సెట్ కమిటీ చైర్మన్ టీకేకేరెడ్డి, కన్వీనర్ విజయకుమార్ రెడ్డిలను కేకే అభినందించారు. ఈ కార్యక్రమంలో బాలకిష్టారెడ్డి, టీకేకేరెడ్డి, విజయకుమార్‌రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, సాంకేతిక విద్య కమిషనర్ శ్రీదేవసేన, జేఎన్టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, ఎప్‌సెట్ కోకన్వీనర్ బాలు నాయక్ పాల్గొన్నారు. కాగా, ఖమ్మంకు చెందిన శిశిరి సాయి ఇంజనీరింగ్ విభాగంలో 39వ ర్యాంకు, బూర సాయిశరన్ అగ్రికల్చర్, ఫార్మసీలో 8వ ర్యాంకు సాధించారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌కు చెందిన ఎం. సాత్వీక్‌రెడ్డి ఎప్‌సెట్‌లో 50వ ర్యాంకు సాధించాడు. భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన సాయివర్ధన్ 63వ ర్యాంకు సాధించాడు.

# కళ్లలో కారం కొట్టి.. మెడకు చున్నీ బిగించి..

- భూవివాదంతో సమీప బంధువులపై ఐదేళ్లుగా న్యాయపోరాటం
- వ్యవసాయ క్షేత్రంలోనే తల్లీకుమార్తెల దారుణ హత్య

**హాలియా, (వార్త వేదిక సూర్య)-మే 17:**

భూవివాదంతో సమీప బంధువులపై ఐదేళ్లుగా న్యాయపోరాటం చేసిన ఆ తల్లీకుమార్తెలు దారుణ హత్యకు గురయ్యారు. వ్యవసాయ క్షేత్రంలో ఉన్న వీరి కళ్లల్లో కారంకొట్టి చున్నీలతో గొంతు బిగించి ఉసురు తీశారు. ఆదివారం నల్లగొండ జిల్లా అనుముల మండలం ఇబ్రహీంపేటలో ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. ఇబ్రహీంపేటకు చెందిన రుద్రాక్ష యాదయ్యకు ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఉన్నారు. యాదయ్య 16ఏళ్ల క్రితం మృతిచెందగా అతని భార్య సుమలత (40), కుమార్తె లావణ్య(20) వ్యవసాయాన్ని ఉపాధిగా చేసుకున్నారు. సుమలత తనకు పుట్టింటి వారిచ్చిన మూడెకరాలతో పాటు, భర్త పేరిట ఉన్న పొలాలను సాగు చేసుకుంటున్నారు. గతంలో యాదయ్య ఆస్తి వివాదం పరిష్కారంలో భాగంగా పంచాయితీ పెద్దల నిర్ణయం మేరకు తన అక్కాచెల్లెళ్లకు తలా ఒక ఎకరం ఇచ్చాడు. అనంతరం యాదయ్య కుటుంబానికి గ్రామంలో ఎనిమిదెకరాల పొలం ఉంది. అందులోనూ తమకు వాటా వస్తుందని ఆడపడుచులు పంచాయితీ పెట్టటంతో తమకు న్యాయం చేయాలని తల్లీకుమార్తెలు కోర్టుకు వెళ్లారు. వీరికి అనుకూలంగా తీర్పు రావడం, కుమార్తె లావణ్య మేజర్ కావడంతో 8 ఎకరాల పొలాన్ని ఆమె పేరిట సుమలత పట్టా చేయించింది. ఆపై కుమార్తెకు వివాహ ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఈ నేపథ్యంలో సమీప బంధువులతో కొంతకాలంగా వివాదం తీవ్రస్థాయికి చేరింది. అప్పటినుంచి వారివల్ల ప్రాణభయం ఉందని గమనించిన కుమార్తె లావణ్య తల్లి వెంటే ఉంటోంది.. ఆదివారం ఉదయం తల్లీకుమార్తె తమ పామాయిల్ తోటకు వెళుతుండగా... వారి సమీప బంధువులు సైతం వెనుకే వెళ్లటాన్ని స్థానికులు గుర్తించారు. కొంత సమయానికి బంధువులు అక్కడినుంచి వెళ్లిపోయారు. అనంతరం అనుమానించిన స్థానికులు తోటలోకి వెళ్లి చూడగా, తల్లీకుమార్తెలు విగతజీవులుగా పడిఉండటాన్ని గుర్తించారు. మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆస్తి తగాదాలే హత్యకు కారణమని ప్రాథమికంగా నిర్ధారించినట్లు తెలిపారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టినట్లు తెలిపారు. కాగా లావణ్య రాజేంద్రనగర్‌లో బీఎస్సీ అగ్రికల్చర్ పూర్తి చేసింది. బంధువుల నుంచి ప్రాణహాని ఉండడంతో ఉద్యోగ ప్రయత్నాలు చేయకుండా తల్లితో పాటే ఉంటోంది.

# గురుకులాలు, హాస్టళ్లపై సర్కార్ ప్రత్యేక దృష్టి

- డైట్, కాస్మొటిక్ చార్జీల కోసం 221.24 కోట్ల విడుదల

**హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-మే 17:**

రాష్ట్రంలోని గురుకులాలు, సంక్షేమ హాస్టళ్ల నిర్వహణను మరింత బలోపేతం చేయడంపై సర్కార్ ప్రత్యేక దృష్టి సారించింది. విద్యార్థులకు డైట్(భోజన), కాస్మొటిక్ చార్జిలతో పాటు హాస్టల్ భవనాల అద్దెను సకాలంలో చెల్లించేందుకు వీలుగా ఇకపై ప్రతినెలా నిధులను విడుదల చేయాలని నిర్ణయించింది. ఇందుకుగానూ ఆదివారం రూ.221.24కోట్ల నిధులు విడుదల చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమశాఖలతో పాటు విద్యాశాఖ పరిధిలో నడిచే సంస్థలకు ఈ నిధులు వినియోగించనుంది. నిధుల విడుదలలో దాదాపు తొమ్మిది నెలల నుంచి నెలకొన్న జాప్యాన్ని అధిగమించేలా.. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని సంబంధిత వర్గాలు తెలిపాయి. మొదట మూడు నెలలకోసారి చెల్లించే పద్ధతిని ప్రవేశపెట్టి, ప్రస్తుతం దాన్ని నెలవారీ చెల్లింపుల ప్రక్రియగా మార్చారని వెల్లడించాయి. తద్వారా విద్యార్థులకు హాస్టళ్లలో మెరుగైన మౌలిక సదుపాయాలు సమకూరుతాయని అధికారులు తెలిపారు.



# 'సర్'కు మతం రంగు పులుముతారా?

- ఉద్యోగులపై ఒక వర్గాన్ని రెచ్చగొడతారా?
- హైదరాబాద్‌లో రోహింగ్యాల ఓట్లు తొలగించద్దా?
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-మే 17:**

"ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ ) చేపట్టేది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులే.. వారిపైనా సీఎంకు నమ్మకం లేదు. వారికీ మతం రంగు పులిమే ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి.. ఒక వర్గాన్ని రెచ్చగొడుతున్నారు. ఇటీవల ఓ ముస్లిం సమ్మేళనంలో పాల్గొన్న సీఎం... ముస్లింల ఓట్లు తొలగించడానికి కేంద్రం ప్రయత్నిస్తోందని ఆరోపించడం సిగ్గుచేటు. సొంత ప్రభుత్వ అధికారులనే ఆయన అవమానించారు.. కించపరిచారు" అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. తెలిసో తెలియకో కొంత మందికి రెండు, మూడు చోట్ల ఓట్లున్నాయని, వాటిని తొలగించడమే సర్ ఉద్దేశమని వివరించారు. సర్ ప్రక్రియ అమలులో ఎక్కడ కుట్ర జరిగిందో రేవంత్, కేటీఆర్ వెల్లడించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో అక్రమంగా ఉంటున్న ప్రతీ రోహింగ్యా ఓటును వెతికి తొలగించాల్సిందేనని తేల్చిచెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీని సక్రమంగా అమలు చేయకపోవడంతో కొందరు రైతులను బ్యాంకులు డీఫాల్టర్లుగా చూపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం ఎందుకు కొనడం లేదంటే.. ఏ మంత్రీ సమాధానం చెప్పడం లేదన్నారు. కాగా, పెట్రోల్ ధరలు పెంచడం అప్రజాస్వామికం అంటున్న సీఎం రేవంత్.. వ్యాట్ తగ్గించి ప్రజలకు ఎందుకు ఉపశమనం కలిగించడం లేదని నిలదీశారు. కాగా, బండి భగీరథ్ ఇప్పటికే పోలీసులకు సరెండర్ అయ్యారని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కేసును రాష్ట్ర పోలీసులే దర్యాప్తు చేస్తున్నారని, ఇందులో కేంద్రానికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

# కఠినంగానే జేఈఈ అడ్వాన్స్‌డ్- 2026

**హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-మే 17:**

దేశంలోని ఐఐటీలు, ఇతర ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ 2026 పరీక్ష కాస్త కఠినంగానే ఉందని నిపుణులు చెబుతున్నారు. ఆదివారం ఉదయం, సాయంత్రం రెండు పేపర్లుగా ఈ పరీక్ష జరిగింది. ఒక్కో పేపర్ కాలవ్యవధి 3గంటలు కాగా.. రెండు పేపర్లలోనూ గణితం, భౌతికశాస్త్రం, రసాయశాస్త్రం నుంచి ప్రశ్నలు అడిగారు. మొదటి పేపర్ మోడరేట్ నుంచి కఠినంగా ఉంది. ఈ పేపర్‌లో గణితం విభాగంలో ప్రశ్నలు చాలా కష్టంగా ఉన్నాయని విద్యార్థులు తెలిపారు. ప్రశ్నల నిడివి కూడా ఎక్కువగా ఉంది. ఫిజిక్స్‌లో ప్రశ్నలు కాన్సెప్టులు లోతుగా తెలిస్తేనే సమాధానం రాయగలిగేలా అడిగారు. కెమిస్ట్రీలో చాలా ప్రశ్నలు గందరగోళపరిచేలా ఉన్నాయి. రెండో పేపర్‌లోనూ గణితం ప్రశ్నలు చాలా కఠినంగా ఉన్నాయని విద్యార్థులు చెబుతున్నారు. పేపర్ మొత్తం ఎక్కువగా కాన్సెప్టులతో కూడిన ప్రశ్నలే ఉండటంతో సమాధానాలు గుర్తించడానికి ఎక్కువ సమయం తీసుకోవాల్సి వచ్చిందని విద్యార్థులు తెలిపారు. రెండు పేపర్లలో ప్రతి సబ్జెక్టులోనూ సింగిల్ చాయిస్, మల్టిపుల్ చాయిస్, మ్యాట్రిక్స్ మ్యాచ్, ఇంటీజర్ టైప్ ప్రశ్నలు అడిగారు. ఒక్క ఇంటీజర్ టైప్ ప్రశ్నలకు మాత్రమే నెగెటివ్ మార్కులు లేవు. మిగిలిన మూడింటిలో ఏ ప్రశ్నకు సమాధానం తప్పుగా గుర్తించినా ఒక మార్కు తగ్గిస్తారు. మొదటి పేపర్‌లోని ఫిజిక్స్ విభాగంలో ప్రధాన చాప్టర్ల నుంచే ప్రశ్నలు అడిగారని ఆకాశ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ అజయ్ శర్మ తెలిపారు. మోడ్రన్ ఫిజిక్స్, కరెంట్ ఎలక్ట్రిసిటీ, ఎలక్ట్రో స్టాటిస్టిక్స్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు అడిగారు. పలు కాన్సెప్టులను కలగలిపి ప్రశ్నలు అడిగారని శిక్షా నేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ సౌరభ్ కుమార్ తెలిపారు. కెమిస్ట్రీ ప్రశ్నలు మోడరేట్‌గా ఉన్నాయని చెబుతున్నారు. ఫిజికల్, ఆర్గానిక్ కెమిస్ట్రీ నుంచి ప్రశ్నలు అడిగారు. మ్యాథ్స్‌లో డెఫినెట్ ఇంటిగ్రేషన్, డిఫరెన్షియల్ ఈక్వేషన్స్, వెక్టర్ట్, 3డి జామెట్రీ తదితర విభాగాల నుంచి ప్రశ్నలు వచ్చాయి. రెండో పేపర్‌లో మ్యాథ్స్ విభాగం చాలా కష్టంగా ఉందని విద్యార్థులు తెలిపారు. ఫిజిక్స్‌లో కాలిక్యులేషన్స్ ప్రశ్నల నిడివి ఎక్కువగా ఉంది. మెకానిక్స్, ఎలక్ట్రో డైనమిక్స్, ఆప్టిక్స్, థర్మోడైనమిక్స్ తదితర విభాగాల నుంచి ప్రశ్నలు వచ్చాయి.

# భవిష్యత్తుకు బలమైన పునాది విద్య





## జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

నల్లగొండ బ్యూరో, మే 17 (వార్తా వేదిక సూర్య )

భవిష్యత్తుకు బలమైన పునాది విద్య అని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం నల్గొండ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన విద్యా విజయోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పదవ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. మొదటి స్థానంలో నిలిచిన 13 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేల రూపాయల నగదు బహుమతిని అందజేశారు. కేజీబి వి మరియు మోడల్ స్కూల్‌లకు చెందిన 5 మంది విద్యార్థులు, స్పోర్ట్స్ స్కూల్ నుండి 4 మంది, జూనియర్ కళాశాలల నుంచి 3 విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ఇష్టంతో, కష్టపడి చదవాలని చెప్పారు. పదవ తరగతితో చదువును ఆపకుండా ప్రతి విద్యార్థి ఉన్నత విద్యాభ్యాసం కొనసాగించాలని, పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు చదివితేనే నేటి పోటీ ప్రపంచంలో మంచి అవకాశాలు లభిస్తాయని అన్నారు. గ్రాడ్యుయేషన్ విద్యతో జీవితంలో గొప్ప మార్పు సాధ్యమవుతుందని తెలిపారు. పై చదువులకు వెళ్లే విద్యార్థులకు సరైన దిశానిర్దేశం అవసరమని, ఉపాధ్యాయులు, ఎంఈఓలు విద్యార్థులను ప్రోత్సహించే బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు. పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఇంటర్మీడియట్ లేదా పాలిటెక్నిక్ వంటి కోర్సుల్లో చేరేలా ప్రోత్సహించాలని కోరారు. అనంతరం మానసిక దివ్యాంగులకు అవసరమైన కిట్‌లను జిల్లా కలెక్టర్ అందజేసి వారి పట్ల సామాజిక బాధ్యతను తెలియజేశారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి దస్రునాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి ,ఎంఈఓ లు , ఉపాధ్యాయులు, విద్యార్థులతల్లిదండ్రులు హాజరయ్యారు.



## మజ్జిగ పంపిణీ చేసి మానవత్వాన్ని చాటుకున్న ట్రాన్స్ జెండర్స్

### మీ సేవలో మేము సైతం అంటూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన ట్రాన్స్ జెండర్స్

దేవరకొండ మే 17 (వార్త వేదిక సూర్య):-

కొండమల్లేపల్లి పట్టణంలో కేఎంపి హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రానికి ఆదివారం కొండమల్లేపల్లి ట్రాన్స్ జెండర్స్ కమ్యూనిటీ ఆధ్వర్యంలో 120 కేజీల పెరుగును వితరణగా ఇచ్చి మజ్జిగ పంపిణీ చేశారు. మీ సేవలో మేము సహితం అంటూ కొండమల్లేపల్లి ట్రాన్స్జెండర్ కమ్యూనిటీ వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. వేసవిలో అల్లాడుతున్న ప్రజలకు మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమని పలువురు వారిని అభినందించారు. ఆదివారం కావడంతో 2500 మంది ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఆర్థికంగా పరిపుష్టితో ఉన్న ఎంతోమంది పది రూపాయలు దానం చేయని ఈ రోజుల్లో ట్రాన్స్ జెండర్స్ ముందుకు వచ్చి సొంత ఖర్చులతో మజ్జిగ పంపిణీ చేయడం మెచ్చుకోదగ్గ విషయం అని పలువురు అన్నారు. వీరిని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి ఇలాంటి సేవా కార్యక్రమం లో పాల్గొనాలని సూచించారు. ఈ సందర్భంగా సొసైటీ ఆధ్వర్యంలో ట్రాన్స్ జెండర్ కమ్యూనిటీ కొండమల్లేపల్లి లాస్య, జయలను ఘనంగా సన్మానించారు. ఇలాంటి సేవలలో మునుముందు ఇంకా పాల్గొంటామని వారు ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏరుకొండ రాము, కూన భానుచందర్, సైదులు, అలంపల్లి విజయ్ తదితరులు పాల్గొన్నారు

## నల్లగొండ లో అంతర్జాతీయ ఎయిడ్స్ కాండిల్ లైట్ స్మారక దినోత్సవం




నల్లగొండ బ్యూరో, మే 17 (వార్తా వేదిక సూర్య )

మే నెల మూడవ ఆదివారం అంతర్జాతీయ ఎయిడ్స్ కాండిల్ లైట్ స్మారక దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. పుట్ల శ్రీనివాస్ ఆదేశాల మేరకు నల్లగొండ జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాల అనుబంధ ప్రభుత్వ ఆసుపత్రి లో గల ఏ.ఆర్.టి కేంద్రం లో జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ సంస్థ ఆధ్వర్యం లో సేవలు అందిస్తున్న పలు స్వచ్ఛంధ సంస్థలు, సిబ్బంది మరియు ఎచ్ ఐ వి సోకిన బాధితులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో ప్రస్తుతం అందుబాటు లో వున్నా వివిధ సదుపాయాల గురించి తెలియజేయడం తో పాటు ఏ . ఆర్.టి మందుల ప్రాధాన్యత తో పాటు గతం లో ఈ వ్యాధి సోకి చనిపోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని అందరు మౌనం పాటించారు. చికిత్స మధ్యలో మందులు ఆపేశావారికీ స్వచ్చంధ సంస్థల ద్వారా కౌన్సిలింగ్ ఇప్పించి మల్లి క్రమం తప్పకుండ మందులు వాడే విధంగా చర్యలు తీసుకొంటున్నామని తెలియజేయడం జరిగింది. జిల్లాలో 95-95-99 లక్ష్యం చేరుకునే విధంగా మరియు ఇండెక్స్ టెస్టింగ్ కార్యక్రమం ద్వారా ఎచ్ ఐ వి సోకిన వారి పార్టనర్ 1 : 4

ప్రాతిపదికన 2020 వ సంవత్సరం నుండి ఈ రోజు వరకు నమోదైన వారి అందరిని పరీక్షించడం జరుగుతున్నదని 2030 నాటికీ ఎచ్ ఐ వి రహిత దేశం గ చేయడం లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ సంగీత సత్యనారాయణ ఆదేశానుసారం సేవలందిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సిబ్బంది, స్వచ్చంధ సంస్థ సిబ్బంది, మరియు ఏ . ఆర్ .టి సిబ్బంది లింగస్వామి, రవి, జి. శ్రీనివాస్, నర్సింహా చారి, శ్రీనివాస్, కట్ట వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



## నీటి సరఫరాలో వివక్ష ఎందుకు..?

### కాంగ్రెస్ నాయకులకు బీఆర్ఎస్ సూటి ప్రశ్న

### - నీటి సరఫరాపై కాంగ్రెస్ నేతలపై బీఆర్ఎస్ నేత నవీన్ కుమార్ రెడ్డి విమర్శలు

### - పన్నుల్లో సమభావం... నీటి సరఫరాలో వివక్షా?

మైలర్ దేవ్ పల్లి, మే 17 ( వార్త వేదిక సూర్య) :

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఓల్డ్ విలేజీలు, కాలనీలు అంటూ ప్రజల మధ్య విభజన తెచ్చి, తాగునీటి సరఫరాలో వివక్ష చూపడం అన్యాయమని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు నవీన్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. పన్నులు అందరూ కడుతుంటే, ఓట్లు అందరూ వేస్తుంటే.. కాంగ్రెస్ నాయకులు ఎందుకు తేడా చూపుతున్నారని ఆయన తీవ్రంగా ప్రశ్నించారు. ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యపై పూర్తి అవగాహనతో తాము నిర్వహించిన "వాక్ ఫర్ వాటర్" కార్యక్రమానికి మహిళలు, కాలనీవాసుల నుంచి భారీ మద్దతు లభించిందని ఆయన పేర్కొన్నారు. బండ్లగూడ జాగీర్‌లో సుమారు 40 వేలకు పైగా ఇళ్లు ఉన్నాయని, ప్రతిరోజూ లేదా రోజు విడిచి రోజు (డే బై డే) నీటి సరఫరా చేయాలని నవీన్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రస్తుతం మూడు, నాలుగు రోజులకోసారి మాత్రమే నీరు వస్తుండటంతో మహిళలు, కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని 250కి పైగా కాలనీలకు తాగునీరు అందేలా వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. పాత వాటర్ బెల్స్‌ను తొలగించి, అవసరమైన చోట్ల 6 అంగుళాలు, 4 అంగుళాల కొత్త పైప్‌లైన్లు వేయాలని, నీటి ఒత్తిడి పెంచేందుకు బూస్టర్ మోటార్లు ఏర్పాటు చేయాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన తాగునీటి పోరాటానికి వస్తున్న ప్రజాదరణ చూసి బీజేపీ, కాంగ్రెస్ నాయకులు భయపడిపోయి ప్రెస్ మీట్లు, పేపర్ నోట్లు విడుదల చేస్తున్నారని విమర్శించారు. కార్పొరేషన్ పరిధిలోని 121, 122, 123 డివిజన్లలో నీటి సమస్యే లేదని అబద్ధాలు చెప్తున్న నాయకులకు తాము సవాల్ విసురుతున్నామని స్పష్టం చేశారు. మిషన్ భగీరథ ద్వారా రాష్ట్రంలో ఇంటింటికీ నల్లా కనెక్షన్లు ఇచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఇప్పటికైనా పాలకులు గ్రామాలు -- కాలనీలు అన్న తేడా లేకుండా, ప్రజలందరికీ సమానంగా తాగునీటిని సరఫరా చేయాలని, లేనిపక్షంలో ప్రజల పక్షాన పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## విద్యుత్ అగాధంతో మృతి చెందిన వానరం

### వానరానికి హిందూ సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు

దేవరకొండ మే 17 (వార్తా వేదిక సూర్య):-



కొండమల్లేపల్లి పట్టణంలోని హైదరాబాదు రోడ్డులో వానరం విద్యుత్ అగాధంతో ఆదివారం ఉదయం మృతి చెందింది. అటువైపుగా వెళ్లిన యువకులు వానరం మృతి చెందిన విషయాన్ని గమనించారు. ఈ సందర్భంగా పలువురు యువకులు అక్కడికి చేరుకున్నారు. హిందువులు వానరాన్ని ఆంజనేయ స్వామి రూపంగా కొలుస్తారు. అలాంటి వానరం మృతి చెందడంతో కలత చెంది బాధపడ్డారు. అనంతరం హిందూ సంప్రదాయ పద్ధతిలో వానర మృతదేహానికి కుంకుమ పెట్టి పూలదండలు వేసి పూడ్చారు. అనంతరం కాషాయ కండువా కప్పి, కాషాయ జెండా ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. వానరం చనిపోవడం బాధాకరమని, తమ చేతుల మీదుగా వానర మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గురు స్వామి భూతరాజు దాసు, కొండమల్లేపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఏరుకొండ రాము, కొండమల్లేపల్లి భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు భూతరాజు భరత్ కుమార్, నెల్లికంటి గోపి, శివ గౌడ్, సాయి, వెంకటేశ్వర్లు, ఉదయ్, అభిలాష్, తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో విద్యా వారోత్సవాలు ముగింపు

నల్లగొండ బ్యూరో, మే 17 (వార్తా వేదిక సూర్య )

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల నల్గొండ లో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక లో భాగంగా చివరి రోజు సాంస్కృతిక మరియు క్రీడా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా నల్గొండ పట్టణ డిప్యూటీ మేయర్ అశ్రఫ్ అలీ అమీర్ , మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ డాక్టర్ హరీష్ కుమార్, విశ్వవిద్యాలయ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి రావడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ.. మన సంస్కృతిని, క్రీడలను ఎల్లప్పుడూ కాపాడుకోవాలని అవి మనకు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె శ్రీనివాస రాజు మాట్లాడుతూ.. విద్యార్థులలో క్రీడా పోటీలు స్ఫూర్తిని నింపుతాయని ఉత్సాహాన్ని కలిగిస్తాయని సాంస్కృతి కార్యక్రమాలు మన దేశ సంస్కృతిని కాపాడుతాయని పేర్కొన్నారు. కళాశాల నుండి వివిధ క్రీడా పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేయడం జరిగింది. చివరగా కళాశాల విద్యార్థినులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ మంజుల, సాంస్కృతిక కన్వీనర్ డాక్టర్ భూక్య వీరన్న, అమరావతి, , ప్రొఫెసర్ అరవింద, డాక్టర్ మల్లీశ్వరి, డాక్టర్ సునీత, డాక్టర్ జబీన్, డాక్టర్ సుంకరి రాజారామ్, మల్లికార్జున్, రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అండగా ఉంటాం




### భువనగిరి ఎంపీ చామల కిరణ్ రెడ్డి , ఎమ్మెల్యే వీరేశం భరోసా

### అయిటిపాముల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఎంపీ, ఎమ్మెల్యే


నల్లగొండ బ్యూరో, మే 17 (వార్తా వేదిక సూర్య )

కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో రైతుల నుండి ధాన్యం సేకరణ ప్రక్రియ, తూకం విధానం, తరలింపు ఏర్పాట్లు తదితర అంశాలను పరిశీలించి రైతులతో నేరుగా మాట్లాడారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.."రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. రైతులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుంది" అని స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు, తాగునీరు, నీడ, తార్పాలిన్లు, విశ్రాంతి స్థలం అందుబాటులో ఉండేలా తక్షణ చర్యలు తీసుకో వాలని ఆదేశించారు. దళారుల ప్రమేయం లేకుండా, పారద ర్శకంగా కొనుగోళ్లు జరపాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నది అన్నారు. 48 గంటల్లో రైత ుల ఖాతాల్లో డబ్బు జమ అయ్యే లా పర్యవేక్షిస్తున్నాం" అన్నారు. ఈ కార్యక్రమం లో స్థానిక ప్రజా ప్రతినిధులు, మార్కె ట్ కమిటీ సభ్యులు, వ్యవసాయ, పౌర సరఫరాల శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



# మూలనపడ్డ 'సీసీ రోడ్డు' పనులు..







### శంకుస్థాపన జరిగి మూడు నెలలైనా కదలని వైనం

### - మరో పది రోజుల్లో వర్షాకాలం.. ప్రజల అవస్థలు పట్టవా?

### - అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంపై బీజేపీ సీనియర్ నాయకుడు అడికే మహేందర్ మండిపాటు



**మైలర్ దేవ్ పల్లి, మే 17 ( వార్త వేదిక సూర్య ) :**
జీహెచ్ఎంసీ అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని మైలార్ దేవ్‌పల్లి డివిజన్ లక్ష్మీగూడాలో సీసీ రోడ్డు పనుల శంకుస్థాపన ముచ్చట మూడు నెలలైనా ముందుకు సాగడం లేదు. సుమారు రూ. 27.40 లక్షల వ్యయంతో చేపట్టాల్సిన ఈ పనులు ఇప్పటికీ కాగితాలకే పరిమితం కావడంపై స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల, కాంట్రాక్టర్ల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ బీజేపీ సీనియర్ నాయకుడు అడికే మహేందర్ ఆదివారం ఒక ప్రకటనలో తీవ్రంగా మండిపడ్డారు. గత ఫిబ్రవరి 19వ తేదీన రాజేంద్రనగర్ శాసనసభ్యులు (ఎమ్మెల్యే) చేతుల మీదుగా అత్యంత వైభవంగా ఈ సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన జరిగిందని అడికే మహేందర్ గుర్తు చేశారు. నాణ్యమైన రోడ్డు అందుబాటులోకి వస్తుందని స్థానికులు ఆశపడ్డారని, కానీ శంకుస్థాపన రాయి వేసి మూడు నెలలు గడుస్తున్నా నేటికీ ఒక్క అడుగు కూడా పని ముందుకు పడకపోవడం శోచనీయ మన్నారు. ఇది అధికారుల పర్యవేక్షణా లోపమా లేక కాంట్రాక్టర్ల అలసత్వమా అని ఆయన ప్రశ్నించారు. ఇంత జరుగుతున్నా స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు కనీసం సమీక్ష నిర్వహించ కపోవడం, చర్యలు తీసుకోకపోవడం బాధ్యతారా హిత్యమేనని ధ్వజమెత్తారు. మరో పది రోజుల్లో వర్షాకాలం ప్రారంభం కాబోతుందని, ఈ తరుణంలో పనులు ప్రారంభించకపోతే లక్ష్మీగూడా వాసులు, వాహనదారులు నరకయాతన అనుభవించాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాలు పడితే రోడ్డంతా బురదమయంగా మారి రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రజాధనంతో శంకుస్థాపనలు చేసి, ఆ తర్వాత పనులను గాలికొదిలేయడం సరికాదు. అధికారులు ఇప్పటికైనా తక్షణమే స్పందించి, యుద్ధప్రాతిపదికన ఈ సీసీ రోడ్డు పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి ఆయన కోరారు.

# సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బిఆర్ఎస్‌లోకి భారీ చేరికలు




### - నర్కోడ గ్రామం నుండి గులాబీ గూటికి బిజెపి నేత గుడెపు రాజేందర్

### - కండువాలు కప్పి ఆహ్వానించిన మాజీ మంత్రి సబితా, ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి



**మైలర్ దేవ్ పల్లి,మే 17 ( వార్త వేదిక సూర్య ) :**
రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. శంషాబాద్ మండలం నర్కోడ గ్రామంలో భారతీయ జనతా పార్టీ కి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. గ్రామానికి చెందిన ప్రముఖ బిజెపి నాయకుడు గుడెపు రాజేందర్ తో పాటు, ఆయన అనుచరులు, గ్రామ బిజెపి నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున బిఆర్ఎస్ పార్టీలో చేరారు. రాష్ట్ర మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గ శాసనసభ్యురాలు పి. సబితా ఇంద్రారెడ్డి మరియు రాజేంద్రనగర్ బిఆ రఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి సమక్షంలో ఈ చేరికల కార్యక్రమం ఘనంగా జరిగింది. బిఆర్ఎస్ పార్టీలోకి చేరిన గుడెపు రాజేందర్ మరియు ఇతర బిజెపి నాయకులకు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, కార్తీక్ రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు. బిఆర్ఎస్ పార్టీ సిద్ధాంతాలు, నియోజకవర్గంలో జరుగుతున్న ప్రజా పనులకు ఆకర్షితులై తాము పార్టీలో చేరుతున్నట్లు ఈ సందర్భంగా చేరిన నాయకులు ప్రకటించారు. ఈ సందర్భంగా పార్టీ ముఖ్య నేతలు మాట్లాడుతూ.. నర్కోడ గ్రామం నుండి ఇంత పెద్ద సంఖ్యలో నాయకులు పార్టీలోకి రావడం శుభపరిణామమని, వీరందరికీ పార్టీలో తగిన ప్రాధాన్యత ఉంటుందని హామీ ఇచ్చారు. మండలంలో పార్టీ బలోపేతానికి పాత, కొత్త నాయకులు సమన్వయంతో కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ మండల మరియు పట్టణ పరిధిలోని ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.





# శంషాబాద్ రోడ్డు పనులు వెంటనే చేపట్టాలి..

### లేదంటే రోడ్డుపై బైఠాయిస్తా: ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి హెచ్చరిక

**మైలర్ దేవ్ పల్లి, మే 17 ( వార్త వేదిక సూర్య ) :**



శంషాబాద్ రాళ్లగూడా ప్రాంతంలో నిలిచిపోయిన రోడ్డు పనులపై గౌరవ మాజీ మంత్రి, ఎమ్మెల్యే సభితమ్మ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం జీహెచ్ఎంసి కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడిన ఆమె, వెంటనే రోడ్డు పనులు ప్రారంభించాలని స్పష్టం చేశారు. సమస్యను ఇకపై సహించబోమని, పనులు ప్రారంభించకపోతే తానే స్వయంగా రోడ్డుపై బైఠాయించి ప్రజల తరఫున ఆందోళన చేపడతానని ఘాటుగా హెచ్చరించారు.

రాళ్లగూడా ప్రాంతంలో రోడ్లు పూర్తిగా దెబ్బతినడంతో వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సభితమ్మ తెలిపారు. ముఖ్యంగా వర్షాలు పడుతున్న సమయంలో రోడ్లు మరింత ప్రమాదకరంగా మారాయని, ప్రజలు నిత్యం ఇబ్బం దులు పడుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. అదే విధంగా శంషాబాద్‌లోని జాకీ షోరూమ్ ముందు ఓపెన్ డ్రైనేజీ లైన్‌ను నేరుగా రోడ్డుపై వదిలేయడం వల్ల దుర్వాసన వ్యాపించడంతో పాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందన్నారు. డ్రైనేజీ నీరు రోడ్డుపైకి రావడం వల్ల ప్రమాదాల ముప్పు పెరిగిందని, ప్రజల ఆరోగ్యా నికి కూడా హానికర పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు ఉన్నా లేనట్టుగా వ్యవహరిస్తున్నారు.. ప్రజల సమస్యలపై పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారు అంటూ సభితమ్మ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. వెంటనే రోడ్డు పనులు పూర్తి చేసి, డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు.

# తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలి : డా. వి. పాండుగౌడ్

**మైలర్ దేవ్ పల్లి, మే 17 ( వార్త వేదిక సూర్య ) :**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమ కారులను గుర్తించేందుకు జి.ఓ 679 ద్వారా ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసిన సందర్భంగా టీజేఎస్ చేవెళ్ల అసెంబ్లీ ఇంచార్జి ఆర్కే నాగని, తెలంగాణ ఉద్యమ కారుల జేఏసీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కుమ్మరి రమేష్ ఆధ్వర్యంలో తెలంగాణ ఉ ద్యమకారులు మండల కేంద్రంలోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ ప్రాంతీయ ఉద్యమ సమితి అధ్యక్షులు డా. వి. పాండుగౌడ్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం ఉద్యమ కారులను గుర్తించేందుకు కమిటీ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. కమిటీలో ఉద్యమకారులతో పాటు ముఖ్యంగా ప్రొఫెసర్ కోదండరాం గారికి స్థానం కల్పించడం ఆనందదా యకమని పేర్కొన్నారు. పూర్తిగా ఉద్యమకారులతో కూడిన కమిటీ ఆధ్వర్యంలో నిజమైన తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం జరుగుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కమిటీ ఎలాంటి కాలయాపన లేకుండా, నిష్పక్షపాతంగా విచారణ జరిపి రాజకీయాలకు అతీతంగా తెలంగాణ ఉ ద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరిని గుర్తించాలని కోరారు. గతంలో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలన్నింటినీ ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



# మణికొండ గార్డెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**మైలర్ దేవ్ పల్లి, మే 17 ( వార్త వేదిక సూర్య ) :**
మణికొండ గార్డెన్స్ వెల్ఫేర్ అసోసి యేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం ఘనంగా నిర్వహిం చారు . ఈ సందర్భంగా కాలనీ సభ్యులందరూ ఏకగ్రీవంగా నూతన కార్యవర్గ సభ్యులను ఎన్ను కున్నారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా శ్రీనివా సచారి ఎం, ఉపాధ్యక్షుడిగా జగదీష్ చంద్రరావు ఎ, ప్రధాన కార్యదర్శిగా వెంకట రత్న ప్రసాద్ గాదిరాజు, సంయుక్త కార్యదర్శిగా సంతోష్, కోశాధికారిగా చక్రవర్తి కె ఎన్నిక య్యారు. ఈ కార్యక్రమానికి కాలనీ సభ్యులు పెద్ద ఎత్తున హాజరై తమ మద్దతు మరియు ఆమోదాన్ని తెలిపారు. ఎన్నికలను సజావుగా నిర్వహించినందుకు అధ్యక్షుడు శ్రీనివాసచారి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లా డుతూ, కాలనీ అభివృద్ధి మరియు సమస్యల పరిష్కారానికి సమిష్టిగా పనిచేస్తూ ప్రతి సభ్యునికి అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు.

# హిమగిరి నగర్‌లో ఘనంగా ఉచిత వైద్య శిబిరం

### భారీగా తరలివచ్చిన కాలనీవాసులు -- ఉచిత వైద్య సేవలపై ప్రజల్లో విశేష స్పందన

**మైలర్ దేవ్ పల్లి, మే 17 ( వార్త వేదిక సూర్య ) :**





హిమగిరినగర్ / కేకే నగర్-1లోని సాయి బాబా ఆలయం ఎదురుగా ఆదివారం ఉదయం నిర్వహించిన ఉచిత ఆరోగ్య శిబిరం విశేష స్పందన లభించింది ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగిన ఈ శిబిరానికి పరిసర కాలనీల ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించు కున్నారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది అనే నినాదంతో కాలనీ ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రముఖ వైద్యశాలల సహకారంతో ప్రజలకునాణ్యమైన ఉ చిత వైద్య సేవలు అందించారు. శాలిని కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి తగిన సూచనలు చేశారు. అలాగే ఒమిక్రాన్ హాస్పిటల్స్ సౌజన్యంతో షుగర్, బీపీ తదితర సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచిత డాక్టర్ కన్సల్టేషన్ కూడా కల్పిం చారు. కార్యక్రమానికి ఆల్ కాలనీస్ ఫెడరేషన్ ప్రతినిధులు, వివిధ కాలనీల అధ్యక్షులు, కార్యద ర్శులు హాజరై శిబిరాన్ని పర్యవేక్షించారు. ఇందులో ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షులు వినయ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేంద్రబాబు, కోశాధికారి వంశీ, శాంతి ఎస్టేట్స్ అధ్యక్షులు రామన్న, ఇండస్ వ్యాలీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, కేకే నగర్-1 అధ్యక్షులు రాధాకృష్ణ, ఉపాధ్యక్షులు కిషోర్ తదితరులు పాల్గొన్నారు. హిమగిరినగర్, సాయి బాలాజీ నగర్, కేకే నగర్-1, శాంతి ఎస్టేట్స్ తదితర పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య పరీక్షలు చేయించుకోవడం విశేషం. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతో దోహద పడతాయని నిర్వాహకులు తెలిపారు. ప్రజలు వైద్యుల సూచనలను పాటిస్తూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వైద్యులు, సిబ్బంది మరియు కాలనీవాసులకు నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# వర్షాకాలానికి ముందే మ్యాన్ హోల్స్ పూడికతీత చేపట్టాలి

## : బీజేపీ నాయకుడు నారగూడెం మల్లారెడ్డి

మైలర్ దేవ్ పల్లి, మే 17 ( వార్త వేదిక సూర్య ) :

హైదర్ గూడ ప్రాంత ప్రజల విజ్ఞప్తి మేరకు వర్షాకా లానికి ముందుగానే డ్రైనేజీ మ్యాన్ హోల్స్‌లో పేరుకుపోయిన సిల్ట్, వ్యర్థాలను వెంటనే తొలగించాలని బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి అధికారులను కోరారు.

మరికొద్ది రోజుల్లో వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో మ్యాన్ హోల్స్‌లో పేరుకుపోయిన ఇసుక, చెత్తను తొలగించకపోతే భారీ వర్షాల సమయంలో డ్రైనేజీ నీరు రోడ్లపైకి వచ్చి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో వాటర్ వర్క్స్ అధికారులతో మాట్లాడి ప్రత్యేక సిబ్బందిని పిలిపించి, ఏయిర్ టెక్ మెషిన్‌లు, బకెట్ల సహాయంతో మ్యాన్ హోల్స్‌లోని వ్యర్థాలు, పూడికను తొలగించే పనులను నారగూడెం మల్లారెడ్డి స్వయంగా పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఆఫీస్ సెక్రటరీ సాబాద విజయ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు కాకులారం కృష్ణ కిట్టు, హైదర్ గూడ బస్తీ వాసులు మల్గారి బాలకృష్ణారెడ్డి, మల్గారి కొండల్ రెడ్డి, చెట్టిగారి సతీష్, సిబ్బంది నర్సింగ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు

# మహిళల ఆరోగ్య అవగాహనకు “ఫైబ్రాయిడ్ రెడ్ స్ట్రెంత్ వాక్”

మైలర్ దేవ్ పల్లి, మే 17 ( వార్త వేదిక సూర్య ) :






మహిళల ఆరోగ్య పరిరక్షణ, అవగాహన మరియు మహిళా శక్తిని ప్రోత్సహించే లక్ష్యంతో నిర్వహించిన “ఫైబ్రాయిడ్ రెడ్ స్ట్రెంత్ వాక్” కార్యక్రమంలో రాజ్ బహదూర్ వెంకటరామరెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీ (ఆర్బీవీఆర్ఆర్ టీజీపీఏ) మహిళా ట్రైనీ అధికారులు, అకాడమీ సిబ్బంది కుటుంబ సభ్యులతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. రహేజా మైండ్‌స్పేస్ సమీపంలోని హోటల్ వెస్టిన్ వద్ద ఆదివారం ఉదయం నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమాన్ని అపోలో హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మహిళల్లో అధిక రుతుస్రావం, గర్భాశయ ఫైబ్రాయిడ్స్, రక్తహీనత వంటి ఆరోగ్య సమస్యలపై చైతన్యం కల్పించడం, ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చికిత్స పొందేలా అవగాహన పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి అపోలో హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్పర్సన్ శ్రీమతి శోభన కామినేని ఉదయం సుమారు 5.30 గంటలకు జెండా ఊపి 3 కిలోమీటర్లు మరియు 5 కిలోమీటర్ల అవగాహన వాక్/రన్‌ను ప్రారంభిం చారు. తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్త్, ఐపీఎస్, డీజీపీ నాయకత్వంలో అకాడమీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమాదేవి, అసిస్టెంట్ డైరెక్టర్ రాంబాబు, మహిళా సిబ్బంది, మహిళా ట్రైనీ అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

మహిళల ఆరోగ్యం, ఫిట్‌నెస్, సంక్షేమం మరియు సామాజిక అవగాహన కార్యక్రమాల పట్ల తెలంగాణ పోలీస్ అకాడమీ నిరంతరం కట్టుబడి ఉందని అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్త్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో నేషనల్ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అమిత్ గార్గ్, ఐపీఎస్ కూడా పాల్గొన్నారు.

# నవసేవా సంకల్ప ట్రస్ట్ ఆధ్వర్యంలో మణికొండలో ఉచిత వైద్య శిబిరం



మైలర్ దేవ్ పల్లి,మే 17 ( వార్త వేదిక సూర్య ) :

మణికొండ ప్రాంత ప్రజల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా నవసేవా సంకల్ప ట్రస్ట్ ఆధ్వర్యంలో, టీ ఎక్స్ హాస్పిటల్స్ వైద్య బృందం పర్యవేక్షణలో ఎంప్లాయిస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ హాల్‌లో ఉచిత మెగా హెల్త్ క్యాంప్ మరియు బ్లడ్ డొనేషన్ క్యాంప్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మణికొండ మున్సిపల్ కౌన్సిల్ మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్ ప్రారంభించారు. ఈ మెగా మెడికల్ క్యాంప్‌లో బీపీ, షుగర్, బీఎంఐ, బీఎండీ, ఈసీజీ పరీక్షలతో పాటు నేత్ర, దంత, చర్మం మరియు జుట్టుకు సంబంధించిన ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. టీ ఎక్స్ హాస్పిటల్స్ వైద్య బృందం, కొండపల్లి రంగారావు, ప్రముఖ దంత వైద్య నిపుణుడు డాక్టర్ కొండపల్లి చైతన్య నేతృత్వంలో ప్రజలకు వైద్య సేవలు అందించారు.

కార్యక్రమంలో మణికొండ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణ రెడ్డి, మాజీ సర్పంచ్ యాలాల నరేష్, నార్సింగి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ శ్రీరాములు తదితరులు హాజరై య్యారు .ఎంప్లాయిస్ కాలనీ, హుడా కాలనీ, చైతన్య కాలనీ ప్రాంతాలకు చెందిన ప్రజలు భారీగా హాజరై ఉచిత హెల్త్ సేవలనువినియోగించుకున్నారు. నవసేవా సంకల్ప ట్రస్ట్ చైర్మన్ మణి, ప్రధాన కార్యదర్శి మహేష్, అధ్యక్షుడు మొహమ్మద్ అజార్, ఎంప్లాయిస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, సర్దార్ పటేల్ పార్క్ వాక్ మేట్స్, షేక్‌పేట్ మిత్ర బృందం సభ్యులు కార్యక్ర మంలో పాల్గొని వైద్య పరీక్షల కోసం వచ్చిన వారికి సేవలందించారు



# లేబర్ కార్డుతో ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

## - తెలంగాణ ఆల్ బిల్డింగ్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చెన్నగళ్ల రామచంద్రయ్య

## - శివరాంపల్లిలో కార్మికులకు రక్షణ చర్యలపై అవగాహన సదస్సు

మైలర్ దేవ్ పల్లి, మే 17 ( వార్త వేదిక సూర్య ) :

కార్మికులు తమకున్న లేబర్ కార్డు ద్వారా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ ఆల్ బిల్డింగ్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చెన్నగళ్ల రామచంద్రయ్య పిలుపునిచ్చారు. ఆదివారం రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని శివరాంపల్లిలో యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులకు ‘రక్షణ పరమైన చర్యలు–జాగ్రత్తలు’ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రయ్య మాట్లాడుతూ.. భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులు ముందస్తు రక్షణ చర్యలు తీసుకోకపోతే ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. యాజమాన్యాలు రక్షణ చర్యలు తీసుకోకపోవడం వల్లే ఎంతోమంది కార్మికులు ఎత్తయిన భవనాలపై పనిచేస్తూ ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాన సూచనలు డిమాండ్లు అమావాస్య సెలవు ప్రతి అమావాస్య రోజున కార్మికులు ఎలాంటి పనులకు వెళ్లకుండా, దానిని విధిగా సెలవుదినంగా పాటించాలి. కూలి రేట్లలో మోసాలు కొందరు యాజమాన్యాలు పని ప్రారంభించే ముందు ఒక రేటు మాట్లాడి, పని ముగిశాక కూలి తగ్గించి ఇస్తూ మోసం చేస్తున్నారని, ఇలాంటి ఘటనలపై యూనియన్ గట్టిగా పోరాడి న్యాయం చేస్తుందని హామీ ఇచ్చారు. చట్టబద్ధమైన వేతనాలు కార్మికులకు రక్షణ కల్పించడంతో పాటు చట్ట ప్రకారం రావాల్సిన పూర్తి వేతనాలను యాజమాన్యాలు చెల్లించాల్సిన అవసరం ఉందన్నారు. కార్మిక సంక్షేమం కోసం ఈ యూనియన్ అవిరళంగా కృషి చేస్తోందని, ఏ కార్మికుడికి ఆపద వచ్చినా, ప్రమాదం జరిగినా యూనియన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్మికుల హక్కుల సాధన కోసం, చట్టప్రకారం వచ్చే సదుపాయాలు, సౌకర్యాల కోసం మున్ముందు పెద్ద ఎత్తున పోరాడుతామన్నారు. ఈ క్రమంలో ప్రతి కార్మికుడు తప్పనిసరిగా యూనియన్ సభ్యత్వం తీసుకోవాలని కోరారు. ఈ అవగాహన కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు అశోక్, ప్రధాన కార్యదర్శి ఎన్. యాదగిరి, కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి రవీందర్ రెడ్డి, యూనియన్ నాయకులు జంగయ్య యాదవ్, యాదయ్య, జంగయ్య, ఎన్. రాజ్ కుమార్, పి. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# శంషాబాద్ డివిజన్‌లో ఘనంగా బీఆర్ఎస్ నూతన కమిటీ ఏర్పాటు



మైలర్ దేవ్ పల్లి, మే 17 ( వార్త వేదిక సూర్య ) :

బీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు కే . టీ . రామ రావు ఆదేశాల మేరకు, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కార్తీక్ రెడ్డి సూచనలతో శంషాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు కోలన్ ప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో నూతన కమిటీ ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో ప్రధాన కార్యదర్శులుగా గాజుల రాహుల్, జనార్ధన్ యాదవ్‌లను నియమించగా, ఉపాధ్యక్షులుగా కుమ్మరి అర్జున్, మహేష్ యాదవ్, వెంకటేష్ ముదిరాజ్‌లను ఎంపిక చేశారు. సంయుక్త కార్యదర్శులుగా వేణు గౌడ్, పరమేష్ యాదవ్, బాలరాజు గౌడ్‌లకు బాధ్యతలు అప్పగించారు. నూతన కమిటీ సభ్యులను అభినం దించిన మాజీ మంత్రి సబితా ఇంద్ర రెడ్డి పార్టీ బలోపే తానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండి సేవలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు “జై తెలంగాణ, జై కేసీఆర్ జై కేటీఆర్ , జై కార్తీక్ అన్న నినాదాలతో కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు.



# మణికొండలో ‘జనాగ్రహం ..

## పోటెత్తిన 'వాక్ ఫర్ వాటర్'

## - రిజర్వాయర్లున్నా వాడుక శూన్యం.. ప్రైవేట్ ట్యాంకర్ల దోపిడీపై జనం విసుగు

## - సరిపడా నీరివ్వరు కానీ.. ఐదేళ్ల పాత బిల్లుల పేరిట జలమండలి వేధింపులు

## - అసమర్ధ పాలకులకు ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయం: బీఆర్ఎస్ నేత కార్తీక్ రెడ్డి




మైలర్ దేవ్ పల్లి, మే 17 ( వార్త వేదిక సూర్య ) :

అసమర్థ ప్రజా ప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా మణికొండ, నెక్నంపూర్ పరిధిలోని సామాన్య ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ప్రజాధనంతో కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన రిజర్వాయర్లను వాడుకలోకి తీసుకురావడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారు. ఒకపక్క భూగర్భ జలాలు అడుగంటిపోవడం, మరోపక్క జలమండలి నుండి నీటి సరఫరా లేకపోవడంతో ప్రజలు ప్రైవేట్ ట్యాంకర్ల దోపిడీకి గురవుతూ విసిగివేసారుతున్నారు. ఇలాంటి విపత్కర తరుణంలో సరిపడా నీరు ఇవ్వకపోగా... ఐదేళ్ల క్రితం నాటి పారదర్శకత లేని నీటి బాకీ బిల్లులు, పెనాల్టీల పేరిట జలమండలి అధికారులు ‘జలగల్లా’ పట్టి పీడిస్తు న్నారని స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల నీటి సమస్యలను పరిష్కరిం చాలనే సదుద్దేశంతో బీఆర్ఎస్ పార్టీ ‘వాక్ ఫర్ వాటర్’ (వాక్ ఫర్ వాటర్ ) కార్యక్రమానికి పిలుపునిచ్చింది. అయితే, ప్రజలకు మేలు చేసే స్థాయి, అవకాశం ఉండి కూడా.. పక్కనే జంట జలాశయాలు ఉన్నప్పటికీ స్థానికుల దప్పిక తీర్చలేని కొందరు ప్రజా ప్రతినిధులు, వారి భజన బృందం వింతగా ప్రవర్తిస్తోందని స్థానికులు మండిపడు తున్నారు. ఆడలేక మద్దెల ఓడన్నట్లు.. తన నలుపు తెలియని గురిగింజలా అధికార పక్ష నాయకులు కాకమ్మ కథలు చెబుతూ, ఇతరులపై అపనిందలు వేస్తున్నారు. ప్రజలను మోసం చేస్తున్న ఇలాంటి వారికి రాజకీయ అంతిమ సమయం ఆసన్నమైంది. సమయం వచ్చినప్పుడు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారు. స్థానిక ప్రజల హెచ్చరిక చేశారు. నీరే జీవం.. అది లేకపోతే జీవితమే దుర్లభం’ అనే నగ్న సత్యాన్ని గ్రహించి, రేపటి తరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఆదివారం నాడు బీఆర్ఎస్ పార్టీ నాయకుడు కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ పాదయాత్ర నిర్వహించారు. చింత చెట్టు నుండి మర్రి చెట్టు వరకు సాగిన ఈ ‘వాక్ ఫర్ వాటర్’ కార్యక్రమానికి కనివినీ ఎరుగని రీతిలో స్పందన లభించింది. స్థానిక ప్రజలు, మహిళలు, యువత, వృద్ధులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి ఈ పాదయాత్రను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా నీటి కొరకు అడుగులు వేసిన ప్రతి ఒక్కరికీ బీఆర్ఎస్ నాయకత్వం పేరుపేరునా కృతజ్ఞతాభివందనాలు తెలియ చేశారు. ఇప్పటికైనా స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, వారి భజన బృందాలు కుంభకర్ణ నిద్రావస్థ నుండి మేల్కోవాలని బీఆర్ఎస్ మణికొండ, నెక్నంపూర్ నాయకులు హెచ్చరించారు. రాజకీయాలు పక్కన పెట్టి, ప్రజల బాగోగులను, కనీస అవసరాలను పరిగణనలోకి తీసుకుని నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

# కార్తిక్ రెడ్డి పోరాటాన్ని చూసి కాంగ్రెస్‌లో భయం మొదలైంది: రావులకోళ్ళ నాగరాజ్

## - నీటి కోసం ప్రజలు నడుస్తుంటే... కాంగ్రెస్ నాయకులు విమర్శలకే పరిమితం



మైలర్ దేవ్ పల్లి, మే 17 ( వార్త వేదిక సూర్య ) :
రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలు తీవ్రమైన తాగునీటి సమస్యతో అల్లాడుతున్న వేళ, ప్రజల తరఫున బీఆర్ఎస్ నాయకుడు కార్తిక్ రెడ్డి చేపట్టిన "వాక్ ఫర్ వాటర్" కార్యక్రమానికి వస్తున్న విశేష ఆదరణ కాంగ్రెస్ నాయకుల్లో భయాన్ని కలిగించిందని బండ్లగూడ రాజేంద్రనగర్ సర్కిల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రావులకోళ్ళ నాగరాజ్ తీవ్రస్థాయిలో విమర్శించారు.ప్రజలు నీటి కోసం రోడ్డెక్కి తమ గోడును వినిపిస్తుంటే, కాంగ్రెస్ నాయకులు మాత్రం సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టకుండా రాజకీయ విమర్శలకు దిగడం దారుణమన్నారు. "వాక్ ఫర్ వాటర్" కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారడంతో కాంగ్రెస్ నేతలు జీర్ణించుకోలేక వ్యక్తిగత విమర్శలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.కార్యక్రమం ప్రారంభమైన తర్వాత హడావుడిగా ఎమ్మెల్యే అధికారులతో సమావేశాలు పెట్టడం ప్రజలను మోసం చేసే ప్రయత్నమేనని అన్నారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఇంతకాలం ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడే పరిస్థితి వచ్చేదే కాదన్నారు.ప్రజల సమస్యలపై పోరాటం చేస్తున్న కార్తిక్ రెడ్డి, స్వామి గౌడ్‌లపై అసభ్యకర వ్యాఖ్యలు చేయడం కాంగ్రెస్ నాయకుల దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. ప్రజల కోసం పని చేసే నాయకులను అడ్డుకునే వారిని ప్రజలే రాజకీయంగా తుడిచిపెట్టేస్తారని హెచ్చరించారు.ప్రజల దాహం తీర్చలేని ప్రభుత్వం అధికారంలో ఉండటానికి అర్హత లేదు... ప్రజల కోసం అడుగులు వేసే నాయకుల వెంటే ప్రజలు నిలబడతారు అని రావులకోళ్ళ నాగరాజ్ స్పష్టం చేశారు.

# శివరాంపల్లిలో ఘనంగా "హిందూ సమ్మేళనం"



## భక్తి, ఐక్యత, ధార్మిక చైతన్యంతో విజయవంతమైన మహాసభ

మైలర్ దేవ్ పల్లి, మే 17 ( వార్త వేదిక సూర్య ) :
శివరాంపల్లి గ్రామంలో 16 వ తేదీన ఆదివారం నిర్వహించిన "హిందూ సమ్మేళనం" కార్యక్రమం భక్తి భావం, ఐక్యతా సందేశం, హిందూ ధర్మ చైతన్యంతో ఘన విజయాన్ని సాధించింది. గ్రామ ప్రజలు, యువత, మహిళలు, సేవా బృందాలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సమ్మేళనంలో హిందూ సమాజ ఐక్యత, భారతీయ సంస్కృతి పరిరక్షణ, స్వధర్మ ఆచరణ, సేవా భావం వంటి కీలక అంశాలపై ప్రముఖులు ప్రసంగించారు. ముఖ్య అతిథులుగా హాజరైన రాధా మనోహర్ దాస్ , డా. అన్నదాన సుబ్రహ్మణ్యం , డా. శ్రీమతి ఆశా జోషి హిందూ సమాజం ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరాన్ని వివరించారు. కార్యక్రమం మొత్తం భక్తి వాతావరణంలో, క్రమ శిక్షణతో కొనసాగి గ్రామ ప్రజలలో ధార్మిక చైతన్యాన్ని పెంపొం దించింది. హిందూ సమాజ పరిరక్షణ, సంస్కృతి అభివృద్ధి కోసం ఇలాంటి కార్యక్రమాలు మరింత అవసరమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ మహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి శివరాంపల్లి గ్రామస్తునికి నిర్వాహకులు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# పెట్రోల్, డీజిల్, ధరల పెంపు తో ప్రజలపై పెను భారం మోపుతున్న మోడీ సర్కార్

## సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, ఎండి పాషా, గంగాదేవి సైదులు, గోశిక కరుణాకర్



చౌటుప్పల్ మే 17 వార్తా వేదిక సూర్య
దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో దేశ ప్రజల పెనుబారం మోపుతున్న మోడీ సర్కార్ అని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఆదివారం చౌటుప్పల్ మున్సిపాలిటీ లోని బస్టాండ్ ఎదురుగా పెట్రోల్ బంక్ ఎదురుగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఐదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తికాగానే డీజిల్, పెట్రోల్, ధరలను పెంచి ప్రజల ను మరోసారి మోసం చేసిందని అన్నారు. డీజిల్, పెట్రోల్, ధరల పెరుగుదల వల్ల అనేక రంగాలపై వ్యతిరేక ప్రభావం చూపుతుందని అన్నారు. నిత్యవసర ధరలు పెరిగి సామాన్యుల పాలిట పిడుగుపాటు అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇరాన్-ఇజ్రాయిల్ యుద్ధాన్ని సాకుగా చూపి పెట్రోల్, డీజిల్, రేట్లను పెంచడం సామాన్యుల నడ్డి విరచడమే అని విరుచుకుపడ్డారు. ఎన్నికల ముందు బిజెపి ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచం అని పదే పదే ప్రకటించినది అని గుర్తు చేశారు. ఫలితాలు వచ్చి పది రోజులు దాటగానే ₹3 రూపాయలకు పైగా ధరలు పెంచడం ప్రజల నమ్మకాన్ని వంచించడమే అని అన్నారు. కేవలం ఓట్ల కోసం ఎన్నికల కోసం మోడీ అబద్ధాలు చెబుతున్నారని ప్రజలు భావిస్తున్నారని, ఇది విశ్వాస ఘాతకం, అవుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోలు, డీజిల్, ధరలను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా, గంగాదేవి సైదులు, గోశిక కరుణాకర్, నాయకులు ఆకుల ధర్మయ్య, బత్తుల దాసు, కొండే శ్రీశైలం, బోయి యాదయ్య, తూర్పునూరి మల్లేశం, కందగట్ల ఆనంద్, భావనలపల్లి స్వామి, యాట బాలరాజు, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, ఎండి రహీం, మానే శాలయ్య, భీమగొని బాలరాజు, యాట ముత్యాలు, వల్లూరి నరసింహ, పాల్గొనడం జరిగింది.



# సెంట్రింగ్ పనుల బంద్‌కు గుత్తేదారులందరూ సహకరించాలి

## - మైలార్ దేవ్‌పల్లి సెంట్రింగ్ యూనియన్ విజ్ఞప్తి -- పోలీస్ స్టేషన్‌లో వినతిపత్రం సమర్పణ

మైలర్ దేవ్ పల్లి, మే 17 ( వార్త వేదిక సూర్య ) :
రాష్ట్రవ్యాప్తంగా ప్రకటించిన సెంట్రింగ్ పనుల బంద్‌కు మైలార్ దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని గుత్తేదారులు పూర్తి సహకారం అందించాలని మైలార్ దేవ్‌పల్లి డివిజన్ సెంట్రింగ్ యూనియన్ అసోసియేషన్ పిలుపునిచ్చింది. ఈ మేరకు యూనియన్ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో వినతిపత్రం సమర్పిం చారు. సెంట్రింగ్ పనులు చేసుకునే కార్మికులు, గుత్తేదారులపై ప్రభుత్వం వివక్ష చూపుతోందని, తమ న్యాయ మైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే గుర్తించాలని యూనియన్ నాయకులు కోరారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న బంద్‌లో భాగంగా మైలార్ దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో సెంట్రింగ్ పనులను నిలిపివేయాలని కాంట్రాక్టర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మైలార్ దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ సత్యనా రాయణ మాట్లాడుతూ, బంద్ కార్యక్రమాన్ని శాంతియుతంగా నిర్వహించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా తమ నిరసన కార్యక్రమాన్ని కొనసాగించాలని యూనియన్ సభ్యులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సలహాదారులు వేముల వెంకటేష్, ఎం. దర్శన్, ఉపాధ్యక్షుడు ఎస్. శంకరయ్య, ప్రధాన కార్యదర్శి పి. అశోక్, కోశాధికారి ఎస్. బాలరాజ్, సంయుక్త కార్యదర్శులు ఎం. దేవప్ప, బి. ధనరాజ్, శేఖర్, సింహాద్రి, రామకృష్ణ, గద్దె యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం ఎన్నికలు

## ప్యానల్-2 తరఫున ఎన్. రమేష్ కురుమకు రాష్ట్ర యువత ఉపాధ్యక్ష బాధ్యతలు

మైలర్ దేవ్ పల్లి,మే 17 ( వార్త వేదిక సూర్య ) :



తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం 15/1951 ఎన్నికల సందర్భంగా ప్యానల్-2 తరఫున తెలంగాణ రాష్ట్ర కురుమ యువత ఉపాధ్యక్షుడిగా ఎన్. రమేష్ కురుమను నియమించినట్లు సంఘ నాయకులు తెలిపారు. సంఘ బలోపేతం మరియు కురుమ సమాజ అభివృద్ధి లక్ష్యంగా ఈ నియామకాలు చేపట్టినట్లు పేర్కొన్నారు.నూతనంగా నియమితులైన నాయకులకు సభ్యులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా హెచ్‌పీకేఎస్ జంటనగరాల అధ్యక్షులు ఎస్. వెంకటేష్ మాట్లాడుతూ, బాబుల్ రెడ్డి నగర్ ప్రాంతంలో దాదాపు 40 సంవత్సరాలుగా ఉమ్మడి పాలమూరు జిల్లా కురుమలు నివసిస్తున్నప్పటికీ తెలంగాణ రాష్ట్ర సంఘం నాయకులు ఇప్పటివరకు గుర్తించకపోవడం బాధాకరమన్నారు.ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర సంఘం ప్యానల్-2 తమను గుర్తించి యువతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ, నందేపల్లి రమేష్‌కు తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్ష పదవి, పూజారి ప్రవీణ్ సన్నీకి జంటనగరాల ఉపాధ్యక్ష పదవి ఇవ్వడం ఆనందంగా ఉందని తెలిపారు.భవిష్యత్తులో కురుమ సమాజ అభివృద్ధిపై శ్రద్ధ చూపుతున్న దొడ్డి శ్రీనాథ్‌కు తెలంగాణ వ్యాప్తంగా కురుమ కులస్తులు అండగా నిలవాలని వెంకటేష్ పిలుపునిచ్చారు. సమాజ ఐక్యత కోసం పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్న శ్రీనాథ్‌కు యావత్ తెలంగాణ కురుమలు మద్దతుగా ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్. అశోక్ కుమార్, ఆడికే సంతోష్, శేఖర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సేవకుడు డా. రాజీవ్‌కి ఘనంగా జన్మదిన వేడుకలు



హైదరాబాద్: టీపీసీసీ మెడికల్ అండ్ హెల్త్ వింగ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ ఎం. రాజీవ్ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ డాక్టర్ నాగేష్ గౌడ్, డాక్టర్ ప్రియాంక దంపతులు శాలువాతో సత్కరించి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ రాజీవ్ ప్రజా సేవా కార్యక్రమాల్లో మరింత ముందుకు సాగాలని, ఆయురారోగ్యాలతో చిరకాలం ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. సమాజ సేవలో ఆయన మరి న్ని విజయాలు సాధించాలని అభినందనలు తెలిపారు.



# పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను తగ్గించాలి

## నారి ఐలయ్య , తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి

చిట్యాల ( వార్త వేదిక సూర్య )
పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను తగ్గించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. ప్రజలను సౌకర్యాలు తగ్గించుకోమని చెప్పి విదేశాల్లో మోడీ ఎంజాయ్ చేస్తున్నాడని వారు ఎద్దేవ చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం చిట్యాల మండల ఎనిమిదవ మహాసభ కల్లూరు కుమారస్వామి అధ్యక్షతన జరగగా ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా నారి ఐలయ్య పాల్గొని మాట్లాడుతూ 78 సంవత్సరాల స్వాతంత్ర భారతావనిలో పేదలు మరింత పేదలుగా ధనికులు మరింత ధనికులుగా పెరిగిపోతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల గ్రామీణ వ్యవసాయ కూలీలు, పేదలు పని దొరకక కుటుంబ పోషణకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మోడీ అధికారం చేపట్టిన తర్వాత పోరాడి సాధించుకున్న అనేక హక్కులు, చట్టాలు కాల రాయబడుతున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలకంగా ఉపయోగపడే ఉపాధి హామీ పనిని విబి- జి రామ్ జి పథకముగా మార్చి చట్టానికి ఉరేశారని అన్నారు. రోజురోజుకు కార్పొరేటికరణ, ప్రైవేటీకరణ పెరగడం వల్ల రిజర్వేషన్లు మొత్తం పోయి పేదలకు ఉన్న కాస్త ప్రభుత్వ ఉద్యోగాలు కూడా అందే పరిస్థితిలో లేవని అన్నారు. వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పుల వల్ల వ్యవసాయ కూలీలు వ్యవసాయేతర కార్మికులుగా మారారని వారందరికీ ఉపాధి కోసం సమగ్ర చట్టాన్ని తీసుకొచ్చి పెరుగుతున్న దరుల కనుగుణంగా కనీస వేతనాల చట్టాన్ని ప్రభుత్వం ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. రానున్న కాలంలో దేశవ్యాప్తంగా పేదల సమస్యల పరిష్కారం కోసం, భూ పంపిణీ కోసం, ఉపాధి రక్షణ కోసం అన్ని వర్గాలను సమీకరించి పోరాటాలను కొనసాగిస్తామని వారు పిలుపునిచ్చారు.

సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కత్తుల లింగస్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని ప్రవేశపెట్టి మూడు సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ పథకం అమలు నోచుకోలేదని వ్యవసాయ కూలీలతో ఓట్లు వేసుకుని గద్దనెక్కిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదల పొట్టలు కొట్టి పాలనా కొనసాగిస్తున్నారని తక్షణమే అమలు చేయాలని లేని పక్షంలో వ్యవసాయ కూలీలతో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.
ఎర్రటి ఎండ లో కష్టపడి పనిచేస్తున్న కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలం చెందారని చేసిన కష్టానికి వారం వారం వేతనాలు చెల్లించకుండా నెలల తరబడి పెండింగ్ బిల్లులు ఇవ్వడం లేదని సంబంధిత అధికారులకు చెప్పినప్పటికీ చలనం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీల పొట్ట కొట్టి వారి ఆకలి చావులకు ప్రభుత్వాలు బాధ్యత వాయించాల్సి వస్తుందని, గత ప్రభుత్వాల తీరుగా ఈ ప్రభుత్వం కూడా వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని విమర్శించారు.

ఈ మహాసభలో జిఎంపిఎస్ జిల్లా కార్యదర్శి అవిశెట్టి శంకరయ్య,చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కందగట్ల గణేష్, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆరూరి శ్రీనివాస్, సంగం మండల అధ్యక్ష కార్యదర్శులు కల్లూరు కుమారస్వామి,మెట్టు పరమేష్, మండల ఉపాధ్యక్షులు రెడపాక మల్లయ్య, గోపగోని వెంకన్న మాజీ సర్పంచ్ ఎల్లయ్య, లీలావతి,మల్లేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

అనంతరం మండల నూతన కమిటీ గౌరవ అధ్యక్షులుగా మెట్టు పరమేష్, అధ్యక్షులుగా కోనేటి రాములు, ఉపాధ్యక్షులుగా ఊడుగు లీలావతి, లడే శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కల్లూరు కుమారస్వామి, సహాయ కార్యదర్శులుగా ఏర్పుల మల్లేశ్వరి రెడపాక మల్లయ్య కోశాధికారిగా గోపగోని వెంకన్న లతోపాటు 11 మంది కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

# పద్మజ్యోతి యువజన సంఘం అధ్యక్షునిగా ఎన్నికైన బడుగు కైలాసం

చౌటుప్పల్ మే 17 వార్తా వేదిక సూర్య



యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామంలోని పద్మజ్యోతి యువజన సంఘం నూతన కమిటిని ఆదివారం సంఘం సర్వసభ్యులు కలిసి నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా బడుగు కైలాసం లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.రచ్చ వెంకటేశం ఉపాధ్యక్షులు, వర్కాల రాజు కార్యదర్శి, వనం సురేందర్ కోశాధికారి, పొట్టబత్తిని ఆనంద్ క్రీడల కార్యదర్శి, జెల్ల ఆనంద్ సాంస్కృతిక కార్యదర్శి, కుడికాల శ్రీనివాస్ గ్రంథాలయ కార్యదర్శి మరియు కార్యవర్గ సభ్యులుగా బీమనపల్లి శేఖర్, కైరంకొండ పాండు, బోనగిరి శ్రీనాథ్, గడ్డం గిరీష్, వడ్డేపల్లి సతీష్, సూరెపల్లి సంతోష్ లను ఎన్నుకున్నారు.. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కైరంకొండ స్వప్న అశోక్, గడ్డం నర్సింహ, మాచర్ల కృష్ణ, మరియు సబ్యులు పాల్గొన్నారు.

# ఆదివారం అవగాహన లేకుండా బిఆర్ఎస్ నాయకులు ధర్నా చేయడం సిగ్గు చేటు



**- మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లక్ష్మారెడ్డి**

**ఆత్మకూరు (ఎం), మే 17 , (వార్త వేదిక సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు సబ్ మార్కెట్ యార్డు లో ఐకేపీ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దాన్యం కొనుగోలు కేంద్రం కు లారీలు రావడం లేదని ఆరోపిస్తూ ఆదివారం నాడు సబ్ మార్కెట్ యార్డుకు తాళం వేసి బిఆర్ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేయడం సిగ్గు చేటు అని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాస లక్ష్మా రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా స్థానిక మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల అయిలయ్య చొరవతో దాన్యం కొనుగొలు కేంద్రాలను గతం కంటే ముందుగా ఏర్పాటు చేసి నిరంతరంగా దాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు సంబంధిత అధికారుల సమన్వయంతో ప్రతి దాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా ప్రతి రోజు ఒకటి రెండు లారీలు తరలిస్తుండడం, అంతేకాకుండా కొనుగోలు కేంద్రాల ద్వారా దాన్యం అమ్ముకున్న రైతులకు మూడు నాలుగు రోజులలో నే రైతుల ఖాతాలలో డబ్బులు జమ చేయడం ప్రభుత్వ పాలన పారదర్శకత కు నిదర్శనం అన్నారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వ పదేళ్ల కాలంలో దాన్యం కొనుగోలు కేంద్రాల లో దాన్యం కొనుగోలు కేంద్రాల లో లారీలకు రైతు కమీషన్ ఇచ్చేదాకా లారీలు రాని పరిస్థితి రైతులు అందరూ అనుభవించిందే, ఆనాడు మొలకెత్తిన దాన్యంను బాధిత రైతులను పట్టించుకోని నాయకులు నేడు ఆది వారం హమాలీలకు సెలవు దినం అని అవగాహన రాహిత్యంతోనో లేక అన్నదాతలను ప్రజలను తప్పు దోవ పట్టించడం కోసం మార్కెట్ కు తాళం వేసి నిరసన వ్యక్తం చేయడం సిగ్గు చేటు అని ఎద్దేవా చేశారు స్థానిక సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గారు ఒక ప్రజా ప్రతినిధి అయి ఉండి పని దినంలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి అధికారుల సమన్వయం చేసుకొని రైతులకు తోడ్పాటు అందించాల్సింది పోయి ఆది వారం సెలవు దినంలో సబ్ మార్కెట్ ఐకేపీ సెంటర్ కు తాళం వేసి నిరసన వ్యక్తం చేస్తూ రాజకీయం చేయడం సరైంది కాదని హెచ్చరించారు. ఈ ఏడాది దాన్యం దిగుబడి అధికంగా రావడం తో పాటు ప్రభుత్వ దాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం అమ్మిన రైతులకు తక్కువ సమయంలోనే డబ్బులు పడడం తో వరి సాగు రైతులు అందరూ దాన్యం కొనుగోలు కేంద్రాలను ఆశ్రయించడం, ప్రతి రైస్ మిల్ గోడౌన్ లో దాన్యం నిండుగా ఉండడంతో మిల్లర్లు ఆలస్యంగా దించుకోవడం జరుగుతున్న విషయం నిరసన వ్యక్తం చేసిన బిఆర్ఎస్ నాయకులకు తెలిసి కూడా రాజకీయం చేయడం హాస్యాస్పదం అన్నారు.వేసవి కాలంలో కూడా రైతుల కోసం తపాసుపల్లి రిజర్వాయర్ నుండి నీళ్లను విడుదల చేసి చెరువులు కుంటలు నింపిన ఘనత ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ని ఓర్వ లేని తనంతో బిఆర్ఎస్ నాయకులు విమర్శిస్తే సహించేది లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ జెడ్పిటిసి కోడిత్యాల నరేందర్ గుప్తా, సర్పంచ్ ల ఫోరమ్ మండల అధ్యక్షులు ఉపేందర్ రెడ్డి, వర్కింగ్ ప్రసిడెంట్ ముద్దసాని సిద్దులు, బీసీ సెల్ మండల అధ్యక్షులు కట్టేకోలా హన్మంత్ గౌడ్, ఓబీసీ సెల్ మండల అధ్యక్షులు బత్తిని ఉప్పలయ్య గౌడ్, మాజీ సర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షులు జన్నాయి కోడె నగేష్,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పోతగాని మల్లేశం గౌడ్,జిల్లాకాంగ్రెస్ నాయకులు భాషబోయిన పాపయ్య,కందడి దశరథ రెడ్డి,కిసాన్ సెల్ మండల అధ్యక్షులు నాగం లక్ష్మా రెడ్డి,నాయకులు నోముల యాదగిరి, మేకల మహేష్ రెడ్డి, తవిటి రాజుతదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తులు ఎద్దు అపహరణ



**మోత్కూరు, మే 17 ( వార్త వేదిక సూర్య):** మున్సిపల్ కేంద్రంలోని విశ్రాంతి భవనం ఏరియా ప్రాంతంలో రైతు తొట్ల అంజయ్య తన ఇంటి ముందు 3 ఎద్దులను రోజు మాదిరిగానే కట్టేశారు. అందులో సుమారు 70,000 విలువ చేసే ఒక ఎద్దును గుర్తుతెలియని వ్యక్తులు శనివారం రాత్రి ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం చూసేసరికి ఎద్దు కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికిన జాడలేదు. ఈ విషయాన్ని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు అంజయ్య తెలిపారు. రైతు ఇచ్చిన ఫిర్యాదు ను కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు ట్రాఫిక్ సిఐ



**యాదగిరిగుట్ట మే 17 (వార్త వేదిక సూర్య) :** మద్యం మత్తులో జరిగే రోడ్డు ప్రమాదాలను అరికట్టడంలో భాగంగా యాదగిరిగుట్ట పరిధిలో ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. బ్రీత్ ఎనలైజర్ పరీక్షలో 30 ఎంజీ కంటే ఎక్కువ మోతాదులో మద్యం ఉన్నా చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ లో వాహనదారులపై బ్లడ్ ఆల్కాహాల్ కాన్సంట్రేషన్(బీఏసీ) రేంజ్ నిర్వహించి ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. వారిని కోర్టులో హాజరుపరచుటకు దిశా నిర్దేశం చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట ట్రాఫిక్ సిఐ యలగొండ కృష్ణ, ఎస్సైలు దేవేందర్, రాజు కానిస్టేబుళ్లు కోటి, నితిన్, శ్రీనివాస్ రెడ్డి, సైదులు, నరేష్ తదితరులు ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నీటి సరఫరాలో వివక్ష ఎందుకు..? కాంగ్రెస్ నాయకులకు బీఆర్ఎస్ సూటి ప్రశ్న

**- నీటి సరఫరాపై కాంగ్రెస్ నేతలపై బీఆర్ఎస్ నేత నవీన్ కుమార్ రెడ్డి విమర్శలు**

**- పన్నుల్లో సమభావం... నీటి సరఫరాలో వివక్షా?**

**మైలర్ దేవ్ పల్లి, మే 17 ( వార్త వేదిక సూర్య) :** బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఓల్డ్ విలేజీలు, కాలనీలు అంటూ ప్రజల మధ్య విభజన తెచ్చి, తాగునీటి సరఫరాలో వివక్ష చూపడం అన్యాయమని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు నవీన్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. పన్నులు అందరూ కడుతుంటే, ఓట్లు అందరూ వేస్తుంటే.. కాంగ్రెస్ నాయకులు ఎందుకు తేడా చూపుతున్నారని ఆయన తీవ్రంగా ప్రశ్నించారు. ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యపై పూర్తి అవగాహనతో తాము నిర్వహించిన "వాక్ ఫర్ వాటర్" కార్యక్రమానికి మహిళలు, కాలనీవాసుల నుంచి భారీ మద్దతు లభించిందని ఆయన పేర్కొన్నారు. బండ్లగూడ జాగీర్‌లో సుమారు 40 వేలకు పైగా ఇళ్లు ఉన్నాయని, ప్రతిరోజూ లేదా రోజు విడిచి రోజు (డే బై డే) నీటి సరఫరా చేయాలని నవీన్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రస్తుతం మూడు, నాలుగు రోజులకోసారి మాత్రమే నీరు వస్తుండటంతో మహిళలు, కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని 250కి పైగా కాలనీలకు తాగునీరు అందేలా వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. పాత వాటర్ బెల్స్‌ను తొలగించి, అవసరమైన చోట్ల 6 అంగుళాలు, 4 అంగుళాల కొత్త పైప్‌లైన్లు వేయాలని, నీటి ఒత్తిడి పెంచేందుకు బూస్టర్ మోటార్లు ఏర్పాటు చేయాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన తాగునీటి పోరాటానికి వస్తున్న ప్రజాదరణ చూసి బీజేపీ, కాంగ్రెస్ నాయకులు భయపడిపోయి ప్రెస్ మీట్లు, పేపర్ నోట్లు విడుదల చేస్తున్నారని విమర్శించారు. కార్పొరేషన్ పరిధిలోని 121, 122, 123 డివిజన్లలో నీటి సమస్యే లేదని అబద్ధాలు చెప్తున్న నాయకులకు తాము సవాల్ విసురుతున్నామని స్పష్టం చేశారు. మిషన్ భగీరథ ద్వారా రాష్ట్రంలో ఇంటింటికీ నల్లా కనెక్షన్లు ఇచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఇప్పటికైనా పాలకులు గ్రామాలు -- కాలనీలు అన్న తేడా లేకుండా, ప్రజలందరికీ సమానంగా తాగునీటిని సరఫరా చేయాలని, లేనిపక్షంలో ప్రజల పక్షాన పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



# మూలనపడ్డ 'సీసీ రోడ్డు' పనులు..

**▶▶ శంకుస్థాపన జరిగి మూడు నెలలైనా కదలని వైనం**

**- మరో పది రోజుల్లో వర్షాకాలం.. ప్రజల అవస్థలు పట్టవా?**

**- అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంపై బీజేపీ సీనియర్ నాయకుడు అడికే మహేందర్ మండిపాటు**


**మైలర్ దేవ్ పల్లి, మే 17 ( వార్త వేదిక సూర్య ) :** జీహెచ్ఎంసీ అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని మైలార్ దేవ్‌పల్లి డివిజన్ లక్ష్మీగూడాలో సీసీ రోడ్డు పనుల శంకుస్థాపన ముచ్చట మూడు నెలలైనా ముందుకు సాగడం లేదు. సుమారు రూ. 27.40 లక్షల వ్యయంతో చేపట్టాల్సిన ఈ పనులు ఇప్పటికీ కాగితాలకే పరిమితం కావడంపై స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల, కాంట్రాక్టర్ల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ బీజేపీ సీనియర్ నాయకుడు అడికే మహేందర్ ఆదివారం ఒక ప్రకటనలో తీవ్రంగా మండిపడ్డారు. గత ఫిబ్రవరి 19వ తేదీన రాజేంద్రనగర్ శాసనసభ్యులు (ఎమ్మెల్యే) చేతుల మీదుగా అత్యంత వైభవంగా ఈ సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన జరిగిందని అడికే మహేందర్ గుర్తు చేశారు. నాణ్యమైన రోడ్డు అందుబాటులోకి వస్తుందని స్థానికులు ఆశపడ్డారని, కానీ శంకుస్థాపన రాయి వేసి



మూడు నెలలు గడుస్తున్నా నేటికీ ఒక్క అడుగు కూడా పని ముందుకు పడకపోవడం శోచనీయ మన్నారు. ఇది అధికారుల పర్యవేక్షణా లోపమా లేక కాంట్రాక్టర్ల అలసత్వమా అని ఆయన ప్రశ్నించారు. ఇంత జరుగుతున్నా స్థానిక



ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు కనీసం సమీక్ష నిర్వహించ కపోవడం, చర్యలు తీసుకోకపోవడం బాధ్యతారా హిత్యమేనని ధ్వజమెత్తారు. మరో పది రోజుల్లో వర్షాకాలం ప్రారంభం కాబోతుందని, ఈ తరుణంలో పనులు ప్రారంభించకపోతే లక్ష్మీగూడా వాసులు, వాహనదారులు నరకయాతన అనుభవించాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాలు




పడితే రోడ్డంతా బురదమయంగా మారి రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రజాధనంతో శంకుస్థాపనలు చేసి, ఆ తర్వాత పనులను గాలికొదిలేయడం సరికాదు. అధికారులు ఇప్పటికైనా తక్షణమే స్పందించి, యుద్ధప్రాతిపదికన ఈ సీసీ రోడ్డు పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి ఆయన కోరారు.

# మజ్జిగ పంపిణీ చేసి మానవత్వాన్ని చాటుకున్న ట్రాన్స్ జెండర్స్

**▶▶ మీ సేవలో మేము సైతం అంటూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన ట్రాన్స్ జెండర్స్**

**దేవరకొండ మే 17 , (వార్త వేదిక సూర్య) :** కొండమల్లేపల్లి పట్టణంలో కేఎంపి హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రానికి ఆదివారం కొండమల్లేపల్లి ట్రాన్స్ జెండర్స్ కమ్యూనిటీ ఆధ్వర్యంలో 120 కేజీల పెరుగును వితరణగా ఇచ్చి మజ్జిగ పంపిణీ చేశారు. మీ సేవలో మేము సహితం అంటూ కొండమల్లేపల్లి ట్రాన్స్జెండర్ కమ్యూనిటీ వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. వేసవిలో అల్లాడుతున్న ప్రజలకు మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమని పలువురు వారిని అభినందించారు. ఆదివారం కావడంతో 2500 మంది ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఆర్థికంగా పరిపుష్టితో ఉన్న ఎంతోమంది పది



రూపాయలు దానం చేయని ఈ రోజుల్లో ట్రాన్స్ జెండర్స్ ముందుకు వచ్చి సొంత ఖర్చులతో మజ్జిగ పంపిణీ చేయడం మెచ్చుకోదగ్గ విషయం అని పలువురు అన్నారు. వీరిని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి ఇలాంటి సేవా కార్యక్రమం లో పాల్గొనాలని



సూచించారు. ఈ సందర్భంగా సొసైటీ ఆధ్వర్యంలో ట్రాన్స్ జెండర్ కమ్యూనిటీ కొండమల్లేపల్లి లాస్య, జయలను ఘనంగా సన్మానించారు.ఇలాంటి సేవలలో మునుముందు ఇంకా పాల్గొంటామని వారు ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏరుకొండ రాము, కూన భానుచందర్, సైదులు, అలంపల్లి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి భువనగిరి
వార్త వేదిక సూర్య
సంపుటి : 1 సంచిక : 351
యాదాద్రి భువనగిరి
సోమవారం, మే 18, 2026

# సుద్దాలలో జోరుగా పండు తాళ్ల కళ్ళు మందు వద్దు కళ్ళు ముద్దు

**గుండాల, మే 17 వార్తవేదిక సూర్య :** సుద్దాల పండుదాల్ల కళ్ళు వోడవడం కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా గౌడ సంఘం అధ్యక్షులు యమగాని వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ సంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. గౌడ సంఘం ఉపాధ్యక్షుడు గూడ రవి గౌడ్, కార్యదర్శి గడ్డమీద కిషన్ గౌడ్ కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో బత్తిని మహేష్ గౌడ్ పాల్గొని ప్రత్యేకంగా ఆశీర్వాదాలు అందించారు. అలాగే గౌడ సంఘం సభ్యుడు యమగాని ఐలయ్య గౌడ్, మాజీ జెడ్పిహెచ్ఎస్ హైస్కూల్ చైర్మన్ బత్తిని రాజు గౌడ్ హాజరై కార్యక్రమాన్ని అభినందించారు. గుండాల మండలం జై గౌడ్ ఉద్యమ నాయకుడు కోల కృష్ణ గౌడ్ మాట్లాడుతూ గౌడ సంఘం ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గౌడ సుద్దాల యూత్ జై గౌడ్ ప్రధాన కార్యదర్శి గడ్డమీది నవీన్ గౌడ్, జై గౌడ్ కోశాధికారి కోల ప్రవీణ్ గౌడ్ యువత సేవా కార్యక్రమాల్లో ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించబడింది. గ్రామ ప్రజలు, గౌడ సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు..



## ఉపాధ్యాయుల బదిలీలు మార్గదర్శకాల ప్రకారమే నిర్వహించాలి



**మోత్కూరు, మే 17( వార్త వేదిక సూర్య):** రాష్ట్రంలో అన్ని సొసైటీల గురుకుల పాఠశాల ఉపాధ్యాయుల బదిలీలను మార్గదర్శకాల ప్రకారమే నిర్వహించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెతుకు సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మోత్కూరులో విలేఖరులతో మాట్లాడుతూ ఉద్యోగుల బదిలీలపై నిషేధం ఎత్తివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన ప్రకారం మినీ స్టీరియల్ సిబ్బందికి మాత్రమే బదిలీ చేయాలని, ఈ మార్గదర్శకాలు ఉపాధ్యాయులకు వర్తించవని తెలిపారు. జీవో 38 లోని నిబంధన 8 (ఏ) ప్రకారం ఉపాధ్యాయులకు సంబంధించిన విద్యాశాఖ ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేయడానికి అవకాశం ఉందని, ఉపాధ్యాయులంతా ప్రస్తుతం జనగణన వీధిలో ఉన్నందున జూలై ఆగష్టులో ఉపాధ్యాయులు బదిలీ చేపట్టడానికి మార్గదర్శకాలు జారీ చేయాలని కోరారు. కొన్ని గురుకులాల యాజమాన్యాలు ఉపాధ్యాయ బదిలీలను జీవో 38 ప్రకారమే చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని ఇది నిబంధనలకు విరుద్ధమని సైదులు తెలిపారు. ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ విద్యాశాఖ పారదర్శకంగా నిర్వహించకపోతే ఉపాధ్యాయుల అన్ని సంఘాలతో కలిసి ఆందోళన చేయడానికి వెనుకాడబోమని సైదులు స్పష్టం చేశారు.

## అఖిల భారత గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ డివిజన్ అధ్యక్షులుగా అంజయ్య ఎన్నిక



**మోత్కూరు, మే 17 (వార్త వేదిక సూర్య ):** అఖిల భారత గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ భువనగిరి డివిజన్ అధ్యక్షుడిగా ఆత్మకూరు (ఎం) కూరెళ్ళ బిపిఎం గా పనిచేస్తున్న మేడి అంజయ్య ఎన్నికయ్యారు. ఆదివారం మోత్కూరులో జరిగిన ఆ సంఘం డివిజన్ 5వ, ద్వైవార్షిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ఎన్నుకున్నట్లు ఆ సంఘం సభ్యులు తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా ఎల్ దామోదర్ రెడ్డి, కోశాధికారిగా ఏ యాదయ్యను ఎన్నుకున్నట్లు తెలిపారు.

## విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి అధిరోహించాలి

**మోత్కూరు, మే 17 ( వార్త వేదిక సూర్య):** విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి అధిరోహించాలని మున్సిపల్ పరిధిలోని కొండగడప గ్రామానికి చెందిన అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు ఎర్రవెల్లి నవీన్ కుమార్ కోరారు. కొండగడప గ్రామంలో ఎస్సీ కాలనీ చెందిన విద్యార్థులు బోడ హన్సిక (545) బోడ చాందిని (540) తొంట జస్వంత్ (523) ఇటీవల పదవ తరగతి మెరిట్ మార్కులు సాధించారు .మెరిట్ మార్కులు సాధించిన విద్యార్థులకు అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎర్రవెల్లి యాదయ్య, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు బద్దుల చిట్టిబాబు,ఎర్రవెల్లి నర్సయ్య, తొంట భాస్కర్, ఎర్రవెల్లి మధు, తొంట శ్రీను,బోడ భాస్కర్, ఎర్రవెల్లి నాగేశ్వర్,బోడ సోమ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



## మృతుడు వెంకటేష్ కుటుంబాన్ని పరామర్శించిన బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు పన్నాల చంద్రశేఖర్ రెడ్డి

**- 50 కిలోల బియ్యం పంపిణీ**

**మోటకొండూరు, మే 17 (వార్త వేధిక సూర్య):** ఇటీవల అనారోగ్యంతో అకాల మరణం చెందిన మాటూరి వెంకటేష్ కుటుంబాన్ని పన్నాల మల్లారెడ్డి ఫౌండేషన్ చైర్మన్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు పన్నాల చంద్రశేఖర్ రెడ్డి ఆదివారం పరామర్శించారు. మోటకొండూరు మండల కేంద్రంలో ఉన్న మృతుని నివాసానికి వెళ్లిన ఆయన.. వెంకటేష్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చుతూ.. వారికి పన్నాల మల్లారెడ్డి ఫౌండేషన్ తరఫున అన్నివేళలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. అనంతరం ఆ కుటుంబానికి తక్షణ సహాయంగా 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. విపత్కర పరిస్థితుల్లో పేద కుటుంబాలకు సాయం చేయడం తమ ఫౌండేషన్ ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ఈ పరామర్శ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు గాజుల బాలరాజు, గిరిబోయినగూడెం వార్డు సభ్యులు పిసారి వెంకట్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యులు గాజుల ప్రవీణ్, మండల కార్యదర్శి పెరబోయిన నరేష్, బూత్ అధ్యక్షులు గాజుల బంగారి, అలాగే గాజుల బాలకృష్ణ, గాదగాని శ్రీకాంత్ మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.



## మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిసిన శంకరమ్మ



**మోత్కూరు, మే 17 ( వార్త వేదిక సూర్య);** ఇటీవల రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలిగా నియమితులైన తెలంగాణ మలి దశ ఉద్యమ తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి మాతృమూర్తి కాసోజు శంకరమ్మ కుటుంబ సభ్యులతో కలిసి రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమ మంత్రి సీతక్కను ఆదివారం హైదరాబాద్ లో ఆమె నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. మహిళా కమిషన్ సభ్యురాలిగా ఎన్నికైన కాసోజు శంకరమ్మను మంత్రి శాలువాతో ఘనంగా సన్మానించారు.







Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**, and **Printed at SURYA DIGITAL PRINTERS**, H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. **Editor: POLOJU SRINIVASA CHARY. PRGI.NO:- TGTEL/25/A0305,** Cell:9985389183. **EmailId:vaarthavedhikasurya2025@gmail.com**